




మా కలం - సామాన్యుడి బలం

# స్వర్ణసాగరం

www.swarnasagaram.in జాతీయ తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ | సంపుటి : 6 | సంచిక : 179 | పేజీలు : 8 | ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్ | శనివారం 21 జూన్ 2025 | వెల : 2-00


# సందడిగా మారిన విశాఖ



నగరమంతా సందడిగా మారనుండటంతో రెండు రోజుల పాటు అధికారిక సెలవులు
ఒకవైపు ఆరోగ్య చైతన్యాన్ని మిళితం చేస్తూ యోగా దినోత్సవం
మరోవైపు ప్రధాని పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు
బీచ్ రోడ్ నుంచి భీమిలి వరకు చేపలవేటు ఆపేస్తూ ప్రభుత్వం ఇప్పటికే ఆంక్షలు
మొత్తానికి విశాఖ వాసులకు ఇది ఓ ప్రత్యేకమైన అనుభూతిగా మిగిలిపోనుంది!





స్వర్ణసాగరం విశాఖపట్టణం

విశాఖపట్నం నగరం ఇప్పుడు పండగలా మారిపోయింది. నగరమంతా సందడిగా మారనుండటంతో రెండు రోజుల పాటు అధికారిక సెలవులు ప్రకటించారు. ఒకవైపు ఆరోగ్య చైతన్యాన్ని మిళితం చేస్తూ యోగా దినోత్సవం జరిగేందుకు సిద్ధమవుతుండగా, మరోవైపు ప్రధాని పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు ఊపందుకున్నాయి. బీచ్ రోడ్ నుంచి భీమిలి వరకు చేపలవేటు ఆపేస్తూ ప్రభుత్వం ఇప్పటికే ఆంక్షలు విధించింది. మొత్తానికి విశాఖ వాసులకు ఇది ఓ ప్రత్యేకమైన అనుభూతిగా మిగిలిపోనుంది! విశాఖపట్నం.. అందమైన బీచ్‌లు, ఆహ్లాదకర వాతావరణం, ఇప్పుడు అంతర్జాతీయ యోగా దినోత్సవానికి కేంద్రంగా మారుతోంది. జూన్ 21న జరగనున్న యోగా డే వేడుకలు విశాఖను మరోసారి దేశవ్యాప్తంగా దృష్టిలోకి తెస్తున్నాయి. ఈ వేడుకలు చిన్న మట్టిలో కాదు.. ప్రధాన వేదికగా ఆర్కే బీచ్ రోడ్డునే మలుస్తున్నారు. ఇంత భారీ స్థాయిలో యోగా ప్రదర్శన జరగడం ఇదే తొలిసారి కావొచ్చు! ఈ వేడుకల్లో ప్రత్యేకతేమిటంటే ? దాదాపు 25,000 మంది గిరిజన విద్యార్థులు ఒకేసారి సూర్యనమస్కారాలు చేయబోతున్నారు. ఇది నమ్మలేని విషయం లాగే ఉంటుంది కానీ నిజం! ఒకే సమయంలో వేలాది మంది విద్యార్థులు విశాఖ బీచ్ మీద సూర్యుడికి నమస్కారం చేస్తూ యోగా చేస్తే.. ఆ దృశ్యం చూడడానికి దేశమంతా ఎదురు చూస్తోంది. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రుల బృందం కూడా హాజరుకానుంది. ఇదిలా ఉండగా, ప్రధాని నరేంద్ర మోదీ కూడా యోగా దినోత్సవ సందర్భంగా విశాఖకు రానున్నారు. ఆయన పర్యటన నేపథ్యంలో నగరంలో భద్రతా ఏర్పాట్లు చాలా కట్టుదిట్టంగా చేపట్టారు. ముఖ్యంగా బీచ్ రోడ్ పరిసరాల్లో పోలీసులు, నేవీ, కోస్టల్ సెక్యూరిటీ, ఇంటలిజెన్స్ విభాగాలు కలిసి పటిష్టంగా గస్తీలు పెడుతున్నాయి. ఈ రెండు రోజులు.. జూన్ 20, 21 తేదీల్లో విశాఖపట్నం నగరంలో - మిగతా3లో

## వారిని ఓ కంట కనిపెట్టండి

- డిప్యూటీ సీఎం పవన్ ఆదేశం..
- అప్రజాస్వామిక ధోరణిలో మాట్లాడేవారిని ప్రజలు ఓ కంట కనిపెట్టాలని
- సినిమాలో చెప్పే డైలాగులు సినిమా హాలు వరకూ బాగుంటాయి
- వాటిని ఆచరణలో పెడతాము. ఆ డైలాగులకు అనుగుణంగా మేం ప్రవర్తిస్తాం అంటే చూస్తూ ఊరుకోం
- ఇది ప్రజాస్వామ్యంలో సాధ్యం కాదు



స్వర్ణసాగరం విశాఖపట్టణం

వైఎస్ జగన్ పల్నాడు జిల్లా, సత్తెనపల్లి పర్యటనలో వైసీపీ పార్టీ నేతలు చంపేస్తాం, నరికేస్తాం అంటూ బహిరంగంగానే విధ్వంసం సృష్టించడంపై.. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించారు. అనుమతులు లేకుండా డీజేలు, ర్యాలీలు నిర్వహించడంతో పాటు నిబంధనలు తుంగలో తొక్కి ఇరువురు వ్యక్తుల మరణానికి కారణమైనందుకు ఇప్పటికే పోలీసులు చర్యలకు దిగారు. అల్లర్లకు కారణమైన వారిపై వరసగా కేసులు నమోదు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అసాంఘిక శక్తులపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలని - మిగతా3లో



## ఆటవిక పాలన నుంచి అభివృద్ధికి బాటలు వేశాం

- ప్రజలే ఆటవిక పాలనకు చరమగీతం పాడారు
- రాష్ట్రం దశాబ్దాలుగా పేదరికంలో మగ్గడానికి, కార్మికుల వలసలకు కాంగ్రెస్, ఆర్జేడీలే కారణం
- ప్రజాసేవ చేయకపోతే ప్రశాంతంగా పడుకోలేను: మోదీ
- ఎన్డీయే హయాంలోనే బిహార్ అభివృద్ధి దిశగా సాగుతోంది
- "బిహార్‌ను ఎన్డీయే అభివృద్ధి చేస్తుందనడానికి మర్హౌరా రైలు ఫ్యాక్టరీ ఓ ఉదాహరణ.



## ప్రధాని ప్రశంసల జల్లు

స్వర్ణసాగరం విశాఖపట్నం:

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పనితీరుపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. ప్రపంచం మొత్తం ఏపీ వైపు చూసేలా చేశారుగా అంటూ ప్రభుత్వ పెద్దలను అభినందించారు. జూన్ 21న యోగా డే సందర్భంగా విశాఖపట్నంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 5 లక్షల మందికి పైగా జనాలు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ సైతం పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన శుక్రవారం సాయంత్రమే విశాఖకు చేరుకున్నారు. భువనేశ్వర్‌లో బహిరంగ సభ అనంతరం.. నేరుగా విశాఖకు చేరుకున్నారు ప్రధాని. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్య మంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రి నారా లోకేష్, ఎంపీ భరత్‌లు స్వాగతం పలికారు ఈ సందర్భంగా యోగాంధ్ర నిర్వహణ ఏర్పాట్లపై ప్రధాని కాసేపు మాట్లాడారు. ప్రపంచం మొత్తం ఏపీ వైపు చేసేలా చేశారుగా అంటూ సీఎం చంద్రబాబుకు కితాబిచ్చారు ప్రధాని. యోగాంధ్ర ద్వారా సరికొత్త రికార్డ్ సృష్టిస్తున్నామని ప్రధానితో సీఎం చంద్రబాబు చెప్పారు. యోగాంధ్ర ఏర్పాట్ల గురించి తెలుసుకున్న ప్రధాని.. ఏపీ నాయకుల పనితీరు భేష్ అంటూ ప్రశంసించారు.



## ఆంగ్లం సిగ్గుచేటు కాదు.. విద్యార్థుల అభివృద్ధికి ఊతం

- ప్రపంచంతో పోటీ పడే ప్రతి విద్యార్థి ఆంగ్ల భాష నేర్చుకోవాలి
- భాజపా, ఆర్ఎస్ఎస్‌లకు పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకుని.. సమానత్వాన్ని సాధించడం ఇష్టం లేదు
- కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ

## రప్పా రప్పా నరుకుతా'కు జగన్ వత్తాసా



- సమాజానికిఏం చెప్పాలనుకుంటున్నారు?
- విభజన హామీల బాధ్యత మోదీదే: వైఎస్ షర్మిల



## ఎయిర్‌స్పేస్ తెరిచిన ఇరాన్

- ఢిల్లీకి రానున్న 1,000 మంది భారతీయ విద్యార్థులు
- శుక్రవారం అర్ధరాత్రి చేరిన తొలివిమానం
- ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య క్షిపణి, డ్రోన్ దాడులు కొనసాగుతుండటంతో దాదాపు అన్ని అంతర్జాతీయ విమానాలకు ఎయిర్‌స్పేస్‌ను ఇరాన్ మూసివేత

మా కలం - సామాన్యుడి బలం
స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక



# ఆటవిక పాలన నుంచి అభివృద్ధికి బాటలు వేశాం



**పాట్నా:** బీహార్‌ను ఆటవిక రాజ్యంలోని నెట్టిన ఘనత కాంగ్రెస్, ఆర్జేడీలదేనని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విమర్శలు గుప్పించారు. ప్రజలే ఆటవిక పాలనకు చరమగీతం పాడారని, ఇప్పుడు ఎన్డీయే హయాంలో బీహార్ బలమైన అభివృద్ధి దిశగా పయనిస్తోందని అన్నారు. బీహార్‌లోని సివాన్‌లో శుక్రవారంనాడు జరిగిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడుతూ, రాష్ట్రం దశాబ్దాలుగా పేదరికంలో మగ్గడానికి, కార్మికుల వలసలకు కాంగ్రెస్, ఆర్జేడీలే కారణమని అన్నారు. ఎన్డీయే హయాంలో సాధించిన కీలక విజయాలను ప్రధాని ప్రస్తావిస్తూ, 55,000 కిలోమీటర్ల మేర గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు వేశామని, 1.5 కోట్ల ఇళ్లకు విద్యుత్ ఇచ్చామని, 26 కోట్ల మందికి పైపుల ద్వారా తాగునీటిని అందించామని చెప్పారు. బీహార్‌ను ఆటవిక రాజ్యంగా మార్చిన వారు తమ తప్పిదాలను పునరావృతం చేయాలనుకుంటున్నారని, మీ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రధాని హెచ్చరించారు.

**పేదలకు మరిన్ని ఇళ్లు**

పేదలకు మరో మూడు కోట్ల ఇళ్లు నిర్మించి ఇస్తామని ప్రధాని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ప్రజలే తన కుటుంబ సభ్యులనీ, కుటుంబంలోని ఏ ఒక్కరూ కడగండ్లపాలు కాకుండా చూస్తామని, వారి కోసం రేయింబవళ్లూ శ్రమిస్తామని, తమ కల నిజమయ్యేంత వరకూ విశ్రాంతి తీసుకునేది లేదని చెప్పారు. బీహార్ స్వాతంత్ర్య సమరయోధుల గడ్డ అని ప్రశంసించారు. భారతదేశం గ్లోబల్ పవర్‌గా ఎదగడంలో బీహార్ కీలక భూమిక వహిస్తోందని చెప్పారు. భారతదేశం శీఘ్రగతిన పురోగమిస్తుండటంపై ప్రపంచ దేశాలు ఎంతో ఆసక్తిగా చూస్తున్నాయని, త్వరలోనే ప్రపంచలోని మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలువనుందని వారు బలంగా నమ్ముతున్నారని చెప్పారు. సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్ అని మా ప్రభుత్వం చెబుతుంటే.. ఆర్జేడీ, కాంగ్రెస్‌లు మాత్రం 'పరివార్ కా సాత్' అంటూ వారి కుటుంబ శ్రేయస్సుకే ప్రాధాన్యం ఇస్తున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. దేశంలో పేదరికానికి కాంగ్రెస్ 'లైసెన్స్ రాజ్' కారణమన్నారు. నేతల కుటుంబీకులు ధనవంతులు కాగా.. సామాన్యులు మాత్రం పేదలుగానే మిగిలిపోయారన్నారు. రానున్న రోజుల్లో మూడు కోట్ల ఇళ్లు నిర్మిస్తామన్నారు. ప్రజాసేవ చేయకుంటే తాను ప్రశాంతంగా నిద్రపోలేనని.. రాత్రి–పగలు ప్రజల కోసమే పని చేస్తానని వ్యాఖ్యానించారు.


ఈ సందర్భంగా పలు హౌసింగ్, వాటర్, రైల్, పవర్, మ్యాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లోని పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన–అర్బన్ (పీఎంఏవై–యూ) కింద 6,600 మంది లబ్ధిదారులకు తాళం చెవులు అందజేశారు. పీఎంఏవై–యూ లబ్ధిదారులకు తొలి విడత ఇన్‌స్టాల్‌మెంట్‌గా రూ.536 కోట్లు విడుదల చేశారు. మర్హౌరా ప్లాంట్‌లో తయారైన లోకోమోటివ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# యోగీ సర్కార్ లిస్ట్ మామూలుగా లేదే



**లక్నో :** 2017లో బీజేపీ ఉత్తరప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చింది. యోగి ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రి అయ్యారు. అప్పటి నుంచి ఉత్తరప్రదేశ్ అంతటా పోలీసు ఎన్‌కౌంటర్లలో గణనీయమైన పెరుగుదల ఉందని ఇటీవలి డేటా వెల్లడిస్తోంది. ఈ ఆపరేషన్లలో అనేక మంది నేరస్థులు హతమయ్యారు. అలాగే వేల సంఖ్యలో పలువురు గాయపడ్డారు. అయితే తాజాగా మొట్ట మొదటిసారి ఉత్తరప్రదేశ్ పోలీసులు గత ఎనిమిది సంవత్సరాలుగా రాష్ట్ర నేర నిరోధక కార్యకలాపాలపై సమగ్ర డేటాను విడుదల చేశారు.యాక్టింగ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) రాజీవ్ కృష్ణ విడుదల చేసిన డేటా ప్రకారం.. 2017 నుంచి 2024 మధ్య పోలీసు ఎన్‌కౌంటర్లలో మొత్తం 234 మంది కరడుగట్టిన నేరస్థులు హతమయ్యారు. అదనంగా ఈ ఘర్షణల్లో 9,202 మంది నేరస్థులు గాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం నేరాలకు వ్యతిరేకంగా కఠినమైన జీరో–టాలరెన్స్ విధానాన్ని అమలు చేసింది. గత ఎనిమిది సంవత్సరాలలో ఉత్తరప్రదేశ్ అంతటా 14,741 ఎన్‌కౌంటర్ సంఘటనలు జరిగాయి. ఈ ఆపరేషన్లలో 30,293 మంది నేరస్థులు అరెస్టు అయ్యారు. అయితే ఎన్‌కౌంటర్ ఆపరేషన్స్ సమయంలో పోలీసులు కూడా మరణించారు. విధి నిర్వహణలో నేరస్థులతో పోరాడుతున్నప్పుడు 18 మంది పోలీసు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. అలాగే 1,700 మంది పోలీసులు గాయపడ్డారు.డేటా ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా చూసుకుంటే మీరట్ జోన్‌లో అత్యధికంగా ఎన్‌కౌంటర్‌లు జరిగాయి. మొత్తం 4,183 ఆపరేషన్లలో 7,871 మంది నేరస్థులు అరెస్టు అయ్యారు. 2,839 మంది గాయపడ్డారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో 77 మంది భయంకరమైన నేరస్థులు మరణించారు. అలాగే ఇద్దరు పోలీసులు వీరమరణం పొందగా, 452 మంది గాయపడ్డారు. వారణాసిలో1,041 ఎన్‌కౌంటర్‌లలో 2,009 మంది నేరస్థులను అరెస్టు చేశారు. 605 మంది గాయపడ్డారు, 26 మంది మరణించారు. 96 మంది పోలీసు అధికారులు గాయపడ్డారు. అలాగే ఆగ్రా జోన్‌లో 2,288 ఎన్‌కౌంటర్ సంఘటనలు జరిగాయి. దీని ఫలితంగా 5,496 మంది నేరస్థులు అరెస్టు అయ్యారు, 715 మంది గాయపడ్డారు. 19 మంది మరణించారు. ఎన్‌కౌంటర్ సమయంలో 56 మంది పోలీసులు కూడా గాయపడ్డారు.

# మేం నీళ్లెందుకు ఇవ్వాలి?
# కెనాల్ ప్లాన్‌ను వ్యతిరేకించిన ఒమర్ అబ్దుల్లా



**శ్రీనగర్:** జమ్మూకశ్మీర్ జలాలను ఉత్తరాది రాష్ట్రాలకు అనుసంధానించే కెనాల్ ప్లాన్‌ను ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా వ్యతిరేకించారు. మొదట తమ జలాలను తాము వాడుకోవాలని, జమ్మూలో కరవు తరహా పరిస్థితి ఉందని, తామెందుకు పంజాబ్‌కు జలాలు పంపాలని ఆయన ప్రశ్నించారు. సింధు జాలాల వ్యవస్థ నుంచి జమ్మూకశ్మీర్ షేర్‌లోని మిగులు జలాలను పొరుగు రాష్ట్రాలైన పంజాబ్, హర్యానా, రాజస్థాన్‌కు మళ్లించేందుకు 113 కిలోమీటర్ల కెనాల్ ప్రాజెక్టుకు ప్లాన్ జరుగుతోంది. దీనిపై ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ, సింధు జలాల ఒప్పందం కింద పంజాబ్ ఇప్పటికే జలాలు పొందుతోందని చెప్పారు. 'మాకు అవసరమైతే వాళ్లు నీళ్లిస్తారా?' అని ప్రశ్నించారు. పఠాన్‌కోటలో షాపుర్‌కండి ఆనకట్ట నిర్మాణానికి సంబంధించి 45 ఏళ్లుగా పంజాబ్, జమ్మూకశ్మీర్ ప్రభుత్వాల మధ్య వివాదం కొనసాగుతోంది. 1979లో రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం జరిగినా కేంద్రం మధ్యవర్తిత్వంలో 2018లోనే ఇది కార్యరూపం దాల్చింది. పాత వివాదాన్ని ఒమర్ అబ్దుల్లా ప్రస్తావిస్తూ, సింధు జలాల ఒప్పందం కింద ఇప్పటికే పంజాబ్‌కు నీళ్లందుతున్నాయని, మాకు అవసరమైనప్పుడు వాళ్లు నీళ్లిస్తారా అని ప్రశ్నించారు. తమను చాలా ఏళ్లుగా కంటతడిపెట్టేలా వాళ్లు (పంజాబ్) చేశారని, ఇప్పుడు ముందుగా మేము జలాలు వాడుకుని, ఇతరుల గురించి ఆలోచిస్తామని చెప్పారు. కాగా, సింధు జలాల ఒప్పందం కింద పాకిస్థాన్‌కు ఉద్దేశించిన జలాలను పంజాబ్, రాజస్థాన్, హర్యానాకు మళ్లించాలని కేంద్రం నిర్ణయించినట్టు పలు మీడియాలో ఇటీవల కథనాలు వచ్చాయి. ఈ నిర్ణయాన్ని యుద్ధప్రాతిపదికన అమలు చేసేందుకు మౌలిక సదుపాయాల అభివృద్ధిపై జలశక్తి మంత్రి ఇప్పటికే దృష్టి సారించారని చెబుతున్నారు. పాకిస్థాన్‌కు వెళ్లే చుక్కనీరు కూడా వృథా కారాదని మంత్రిత్వ శాఖ పట్టుదలగా ఉందని చెబుతున్నారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాక్‌పై కఠిన చర్యల్లో భాగంగా సింధు జలాల ఒప్పందాన్ని భారత్ రద్దు చేసింది.

## 'మరో లిబియా' కావద్దనే..!
# ట్రంప్ వెనకడుగుకు కారణం ఇదేనా?



**ఇంటర్నెట్ డెస్క్:** ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధంలో అగ్రరాజ్యం జోక్యం చేసుకోవడంపై చర్చ జరుగుతున్న వేళ.. రెండు వారాల్లోపు అధ్యక్షుడు దీనిపై నిర్ణయం తీసుకుంటారని వైట్‌హౌస్ నుంచి కీలక ప్రకటన వచ్చిన సంగతి తెలిసిందే. అయితే, ఇరాన్‌పై సైనిక చర్య చేపట్టే విషయంలో డొనాల్డ్ ట్రంప్ (%ణశీఅఖ్రీస ుతీబఎజూ%) ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఒకవేళ తాము రంగంలోకి దిగితే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని.. ఇరాన్ కూడా మరో లిబియా మాదిరిగా మారవచ్చనే ఆందోళన ట్రంప్ వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. ఆఫ్రికా దేశమైన లిబియాలో పాలన మార్పునకు మద్దతిచ్చిన అమెరికా గతంలో సైనిక చర్య చేపట్టింది. దీంతో 2011లో గడాఫీ ప్రభుత్వం అంతమైంది. కానీ, అప్పటి నుంచి లిబియా అంతర్యుద్ధంలో కొట్టుమిట్టాడుతోంది. ఈ క్రమంలో ఒకవేళ ఇరాన్ యుద్ధంలోనూ జోక్యం చేసుకొని సుప్రీం లీడర్ ఖమేనీని తప్పిస్తే పరిస్థితులు తీవ్ర గందరగోళంగా మారుతాయని ట్రంప్ ఆలోచిస్తున్నట్లు అంతర్జాతీయ వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఇరాన్ మరో లిబియాగా మారొద్దని అధ్యక్షుడు కోరుకుంటున్నారని, అలా జరిగితే దీర్ఘకాలం అనిశ్చితికి దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు అధ్యక్షుడి సన్నిహిత వర్గాలు చెప్పినట్లు తెలిపాయి. ఇజ్రాయెల్ ఇటీవల దాడులు మొదలుపెట్టకముందే ఇరాన్ పరిస్థితిపై ట్రంప్ చాలా ఆందోళన వ్యక్తం చేశారని సమాచారం. అంతేకాదు.. అఫ్గానిస్థాన్, ఇరాక్‌ల ప్రస్తావన తెచ్చిన ఆయన.. అమెరికా సైనిక చర్యతో ఈ రెండు దేశాలు దీర్ఘకాలంగా అస్థిరత్వాన్ని ఎదుర్కొంటున్నట్లు చెప్పినట్లు తెలిసింది. ఒకవేళ ఇరాన్‌పై దాడులు చేసినా.. అణుకేంద్రాలపై గగనతల దాడులు పరిమిత స్థాయిలోనే ఉండవచ్చని ట్రంప్ సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ అమెరికా దాడుల్లో ఇరాన్ ప్రభుత్వం కూలిపోతే ట్రంప్ యంత్రాంగాన్ని నిందించవద్దని వైట్‌హౌస్ వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం. ఖమేనీ పాలనను అంతం చేయడం తమ ఉద్దేశం కాదని, కేవలం అణు స్థావరాలే తమ లక్ష్యమని చెప్పినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే స్పందించిన వైట్‌హౌస్.. శాంతి చర్చల కోసం ద్వారాలు తెరిచే ఉన్నాయని, ఇందు కోసం రెండు వారాల గడువు ఇస్తున్నట్లు ప్రకటన చేసింది. నిర్ణయం తీసుకునే ముందు ట్రంప్ అనేక కోణాల్లో ఆలోచిస్తున్నారని, ప్రపంచ నేతల మాటలతోపాటు అమెరికా ప్రజలు, సలహాదారుల సూచనలను ఆయన పరిగణనలోకి తీసుకుంటున్నారని తెలిపింది.

## ఆంగ్లం సిగ్గుచేటు కాదు..
## విద్యార్థుల అభివృద్ధికి ఊతం



**ఇంటర్నెట్ డెస్క్:** విదేశీ భాషలకు సంబంధించి కేంద్రమంత్రి అమిత్ షా ఇటీవల కీలక వ్యాఖ్యలు చేశారు. ఇంగ్లిషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయని, అలాంటి సమాజం ఏర్పడే రోజులు ఎంతో దూరంలో లేవన్నారు. దీనిపై తాజాగా కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ స్పందించారు. ఆంగ్ల భాష నేర్చుకోవడం సిగ్గుచేటు కాదని.. విద్యార్థుల సాధికారతకు అది చిహ్నమన్నారు. ప్రపంచంతో పోటీ పడే ప్రతి విద్యార్థికి ఆంగ్ల భాష అవసరం ఎంతో ఉందని.. మాతృ భాషతో పాటు ఆంగ్లం తప్పకుండా నేర్పాలని సూచించారు. ఆ భాష విద్యార్థులకు ఆత్మవిశ్వాసాన్ని, ఉపాధిని కల్పిస్తుందని తెలిపారు. భాజపా, ఆర్‌ఎస్‌ఎస్‌లకు పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకుని.. సమానత్వాన్ని సాధించడం ఇష్టం లేదని రాహుల్ గాంధీ విమర్శించారు. అందుకే వారిని విద్యకు దూరం చేయాలనుకుంటున్నారని మండిపడ్డారు. ప్రతి ఒక్కరికి మాతృభాష ఎంత ముఖ్యమో.. ఆంగ్ల భాష కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. భారతదేశంలోని ప్రతి భాషకు ఆత్మ, సంస్కృతి, జ్ఞానం ఉన్నాయని.. వాటిని మనం గౌరవించాలన్నారు. అదే సమయంలో ప్రపంచంతో పోటీ పడడానికి వీలుగా ఆంగ్ల విద్యను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

**అంధ విద్యార్థుల గీతాలాపన.. కంటతడి పెట్టిన రాష్ట్రపతి**

ఇటీవల ఓ కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. ఈ దేశంలో ఇంగ్లిషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయని అన్నారు. మన దేశాన్ని, మన సంస్కృతిని, మన మతాన్ని అర్థం చేసుకునేందుకు ఏ పరాయి భాష సరిపోదని పేర్కొన్నారు. విదేశీ భాషలతో సంపూర్ణ భారతీయ భావనను ఊహించుకోలేమన్నారు. అయితే, ఇది ఎంత కష్టమో తనకు తెలుసని, అయినప్పటికీ ఇందులో భారత సమాజం విజయం సాధిస్తుందన్న విశ్వాసం ఉందన్నారు.

## ఎయిర్‌స్పేస్ తెరిచిన ఇరాన్

**న్యూఢిల్లీ:** ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య యుద్ధం ఉద్ధృతమవుతున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇండియాకు ప్రత్యేక వెసులుబాటు కల్పిస్తూ ఇరాన్‌లో చిక్కుకుపోయిన భారతీయ విద్యార్థులు తిరిగి స్వదేశానికి వెళ్లేందుకు వీలుగా ఇప్పటికే మూసివేసిన ఎయిర్‌స్పేస్‌ను తెరిచింది. దీంతో ఇరాన్ నగరాల్లో చిక్కుకుపోయిన సుమారు 1,000 మంది భారతీయ విద్యార్థులను 'ఆపరేషన్ సింధు' కింద ప్రత్యేక విమానాల్లో న్యూఢిల్లీకి తీసుకువస్తున్నారు. రాబోయే రెండ్రోజుల్లో వీరంతా ఢిల్లీకి చేరుకుంటారు.

**తొలివిమానం**

కాగా, ఇరాన్‌లో ఉంటున్న భారతీయ విద్యార్థులతో వస్తున్న తొలివిమానం శుక్రవారం రాత్రి 11 గంటలకు న్యూఢిల్లీ చేరే అవకాశం ఉంది. రెండో విమానం శనివారం ఉదయం, మూడో విమానం అదేరోజు సాయంత్రం ఇండియాకు చేరుకుంటాయి. ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య క్షిపణి, డ్రోన్ దాడులు కొనసాగుతుండటంతో దాదాపు అన్ని అంతర్జాతీయ విమానాలకు ఎయిర్‌స్పేస్‌ను ఇరాన్ మూసివేసింది. అయితే ఇండియా కోసం ప్రత్యేకమైన క్యారిడార్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి తరలించేందుకు ఇరాన్ ప్రభుత్వం అంగీకరించింది. ఇరాన్‌లో 4,000 మందికి పైగా భారతీయులు నివసిస్తుండగా, వీరిలో సగం మంది విద్యార్థులు ఉన్నారు. 'ఆపరేషన్ సింధు' కింద భారత ప్రభుత్వం 110 మంది భారతీయ విద్యార్థులను ఇప్పటికే న్యూఢిల్లీకి తీసుకువచ్చింది. వీరంతా ఇరాన్ నుంచి అర్మేనియా చేరుకోవడంతో అక్కడి నుంచి వారిని ప్రత్యేక విమానంలో ఢిల్లీ తీసుకువచ్చారు.

## పరిపాలనలో రెవెన్యూశాఖది పెద్దన్న పాత్ర





**స్వర్ణసాగరం, వాకాడు**

పరిపాలనలో రెవెన్యూ శాఖ పెద్దన్న పాత్ర పోషిస్తోందని తహసీల్దారు రామయ్య అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో శుక్రవారం రెవెన్యూ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తహసీల్దారు రామయ్యతో పాటు మండల టీడీపీ నాయకులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు రెవెన్యూ వ్యవస్థ ఏర్పడిన నాటి నుండి ఇప్పటికి రూపాంతరం చెందిన విధానంతో పాటు, రెవెన్యూ వ్యవస్థకు కంచెర్ల గోపన్న లాంటి వ్యక్తులు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ పాలన సమర్థవంతంగా నిర్వహించడంలో రెవెన్యూ శాఖ కీలకమన్నారు. అధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేసి శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విశ్రాంత రెవెన్యూ అధికారులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. టీడీపీ నేతలు దువ్వూరు మధుసూదన్ రెడ్డి, సన్నారెడ్డి విజయశేఖర్ రెడ్డి, దోసకాయల కృష్ణమూర్తి, సన్నారెడ్డి ప్రసాద్ రెడ్డి, కుంచం దయాకర్, తిరుమూరు శ్రీనివాసులు రెడ్డి, బీజేపీ నేత పాపారెడ్డి పురుషోత్త మరెడ్డి రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్ర మానికి సిబ్బంది అందరూ సాంప్రదాయ దుస్తులు ధరించి హాజరవ్వడం చూపర్లను కనువిందు చేసింది.



## ప్రజలకు.. 'వైఎస్ జగన్ అంటే నమ్మకం..

# చంద్రబాబు అంటే మోసం'

**గుంటూరు:** వైఎస్సార్‌సీపీ అధినేత,మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్నాడు జిల్లా,సత్తెనపల్లి నియోజకవర్గం రెంటపాళ్ల పర్యటనను అడ్డుకునేందుకు ప్రయత్నించి కూటమి ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి విడదల రజిని అన్నారు. వైఎస్ జగన్ రెంట పాళ్ల పర్యటనపై విడుదల రజిని శుక్రవారం మీడియా మాట్లాడారు. పల్నాడుజిల్లా చిలకలూరిపేట క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రోజురోజుకూ వైఎస్సార్‌సీపీ అధినేత,మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పెరుగుతున్న ఆదరణ, కూటమి పాలనపై ప్రజల్లో వ్యక్తమవుతున్న ఆగ్రహంను చూసి భయంతో రాజకీయంగా ఆయన ఉనికినే లేకుండా చేయాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిలో భాగంగానే టీడీపీ ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి ఎటువంటి దారుణమైన వ్యాఖ్యలు చేశాడో మొత్తం రాష్ట్ర ప్రజలంతా చూశారని అన్నారు. ఈ వ్యాఖ్యలను వైఎస్సార్‌సీపీ తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు. ఇంకా ఆమె ఏమన్నారంటే.. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న చంద్రబాబు ఏకంగా మాజీ సీఎం ఎస్ జగన్‌ను భూస్థాపితం చేస్తానంటూ మాట్లాడారు. ఆయన పార్టీలోని మరో నేత బుచ్చయ్యచౌదరి విచక్షణ మరిచి వైఎస్ జగన్‌కు హాని కలిగిస్తామనే రీతిలో దారుణమైన వ్యాఖ్యలు చేశారు. ఇవన్నీ చూస్తుంటే టీడీపీ తెర వెనుక ఏదో కుట్ర చేస్తోందనే అనుమానాలు కలుగుతున్నాయి.




### ప్రజాధరణకు పల్నాడు పర్యటనే సాక్ష్యం

పల్నాడు జిల్లాలో వైఎస్ జగన్ పర్యటనను కూటమి ప్రభుత్వం అడ్డుకునేందుకు ఎంత ప్రయత్నించినా ప్రజలు మాత్రం ఆయనను అక్కున చేర్చుకున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ చెందిన నాయకుడు నాగమల్లేశ్వరరావును పోలీసుల ద్వారా తీవ్రంగా వేధించడంతో ఆయన ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించేందుకు వైఎస్ జగన్ వస్తున్న నేపథ్యంలో మొత్తం పోలీస్ యంత్రాంగాన్ని మోహరించి, ఆయన పర్యాటనను విఫలం చేయాలనే కుట్రతో కూటమి ప్రభుత్వం వ్యవహరించింది. ఈ పర్యటనకు వాహనాలను అందించకూడదని ట్రావెల్ ఏజెన్సీలను బెదిరించారు, పెట్రోల్ బంక్‌లు, హోటళ్ళను బలవంతంగా మూసివేయించారు. అయినా కూడా ప్రజలు పెద్ద ఎత్తున వైఎస్ జగన్‌ను చూసేందుకు తరలివచ్చారు. వైఎస్ జగన్‌కు అడుగుడుగునా స్వాగతం పలుకుతూ రోడ్లపై పోటెత్తారు. వైఎస్ జగన్ అంటేనే దేశంలోనే అత్యంత ప్రజాధరణ పొందిన నాయకుడు. ఈ కూటమి ప్రభుత్వ మోసాన్ని గుర్తించామంటూ వైఎస్ జగన్‌కు ప్రజలు తమ మద్దతును ప్రకటించారు.

### చనిపోయిన వారిపైనా రాజకీయమా?

వైఎస్ జగన్ పర్యటనలో దురదృష్టవశాత్తు ఇరువురు చనిపోతే, దానిని కూడా వివాదంగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం శతవిధాలుగా ప్రయత్నించింది. వైఎస్ జగన్ కాన్వాయి వాహనం తగిలి సింగయ్య అనే వ్యక్తి చనిపోయారంటూ ఒక తప్పుడు ప్రచారం చేశారు. అలాగే సత్తెనపల్లిలో ఒక యువకుడు సొమ్మసిల్లి పడిపోయాడు, అతడిని ఆసుపత్రికి తరలించే సరికే అతడు చనిపోయాడు. ఈ ఘటనలు గురించి తెలియగానే వైఎస్‌ఆర్‌సీపీ నేతలు వారి కుటుంబసభ్యులను పరామర్శించడం, ఆ కుటుంబాలకు ఆర్థిక సాయంను అందచేయడం కూడా జరిగింది. ఆ కుటుంబాల పట్ల మా బాధ్యతను ఎక్కడా మరిచిపోలేదు. చివరికి వారి అంత్యక్రియల్లో కూడా పార్టీ నేతలు ఎంతో బాధతో పాల్గొని, ఆ కుటుంబాలను ఓదార్చడం జరిగింది.

### అమాయకుల ప్రాణాలను బలికొన్నది చంద్రబాబు కాదా?

చంద్రబాబు గతంలో సీఎంగా ఉండి, గోదావరి పుష్కరాల సందర్భంగా తన ప్రచారయావతో 29 మందిని బలితీసుకున్నారు. ఇరుకుసందుల్లో సభలను పెట్టి, జనాలను ఎక్కువగా చూపాలనే ప్రయత్నంలో భాగంగా కందుకూరిలో ఎనిమిది మందిని పొట్టనపెట్టుకున్నారు. అలాగే గుంటూరులో టీడీపీ తరుపున చీరెల పంపిణీ పేరుతో మహిళలకు ఆశచూపి, తొక్కిసలాటకు దారితీసిన పరిస్థితిలో ముగ్గురు చనిపోయారు. చంద్రబాబు అసమర్థ పాలనలో తిరుపతి క్యూలైన్లలో ఆరుగురు భక్తులు మృతి చెందారు. వీరి కుటుంబాలకు చంద్రబాబు సమాధానం చెప్పాలి. ఈ మరణాలు చంద్రబాబు నిర్లక్ష్యం వల్ల జరిగిన హత్యలు కావా? తన వల్ల జరిగిన దారుణాలను చంద్రబాబు మరిచిపోయారా?' అని ప్రశ్నించారు.

# వైజాగ్‌కు కాగ్నిజెంట్ 1,582 కోట్ల పెట్టుబడి

**8,000 ఉద్యోగాలు**
**ఐటీ క్యాంపస్ ఏర్పాటుకు సుముఖత ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం**
**2029 నాటికి కార్యకలాపాలు ప్రారంభం విశాఖలో ఎకరా 99 పైసలు చొప్పున**
**21.31 ఎకరాల కేటాయింపు: లోకేశ్**
**ఇప్పటికే టీసీఎసకు గ్రీన్ సిగ్నల్**

**అమరావతి/విశాఖపట్నం**

రాష్ట్ర ఆర్థిక రాజధాని విశాఖకు మరో ప్రఖ్యాత ఐటీ కంపెనీ రానుంది. ఐటీ క్యాంపస్ ఏర్పాటు చేసేందుకు కాగ్నిజెంట్ ముందుకు వచ్చింది. రూ.1,582 కోట్ల పెట్టుబడితో 8,000 మంది యువతకు ఉద్యోగాలను కల్పించనుంది. ఈ మేరకు కాగ్నిజెంట్ పంపిన ప్రతిపాదనలకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. శుక్రవారం ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. విశాఖలో తన కార్యకలాపాల కోసం 21.31 ఎకరాల భూమి కావాలని కాగ్నిజెంట్ కోరిందని తెలిపారు. వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలు స్థాపిస్తే ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలని గురువారం నాడు రాష్ట్ర స్థాయి పారిశ్రామిక ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఈ సందర్భంగా 8,000 మందికి ఉద్యోగాల కల్పనతో పాటు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడే కాగ్నిజెంట్ సంస్థకు ఎకరా 99 పైసలు చొప్పున 21.31 ఎకరాలను కేటాయించాలని ఎస్ఐపీబీ తీర్మానించిందని లోకేశ్ వెల్లడించారు. కాగ్నిజెంట్ తన కార్యకలాపాలను 2029 నుంచి వైజాగ్‌లో ప్రారంభిస్తుందని తెలిపారు. విశాఖ పర్యటనలో కూడా మంత్రి లోకేశ్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఎప్పటి నుంచో కాగ్నిజెంట్ విశాఖపట్నం వస్తామని చెబుతోందని, ఇప్పుడది సాకారమైందని అన్నారు. ఐదేళ్లలో 20 లక్షల మంది యువతకు ఉద్యోగాల కల్పన లక్ష్యానికి చేరువయ్యేలా చేస్తున్న కృషి ఫలిస్తోందని సంతోషం వ్యక్తం చేశారు.

**ఇప్పటికే టీసీఎస్...**

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రూ.1,370 కోట్ల పెట్టుబడులతో 12,000 మందికి ఉద్యోగాలు కల్పించేలా విశాఖలో కార్యాలయం స్థాపనకు టీసీఎస్ చేసిన ప్రతిపాదనలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ కంపెనీకి కూడా ఎకరా 99 పైసలు చొప్పున దాదాపు 22 ఎకరాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా ఐటీ దిగ్గజ సంస్థ కాగ్నిజెంట్ కూడా విశాఖలో రూ.1,582 కోట్ల పెట్టుబడితో దశలవారీగా 8,000 మందికి ఉద్యోగాలు కల్పించేలా క్యాంపస్ ఏర్పాటుకు సంసిద్ధత తెలిపింది. ఈ సంస్థకు కూడా కాపులుప్పాడలో స్థలం కేటాయించాలని నిర్ణయించారు. వీఎంఆర్‌డీఏ ఇందుకు సానుకూలంగా స్పందించింది. విశాఖకు ఈ రెండు కంపెనీల రాకతోనే 20,000 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. ఇన్ని వేలమంది ఉద్యోగులతో పాటు వారి కుటుంబాలు విశాఖకు తరలి వస్తే నగర విస్తరణ, ఆర్థిక కార్యకలాపాలు ఏ స్థాయిలో పెరుగుతాయో ఊహించుకోవచ్చని లోకేశ్ పేర్కొన్నారు. కంపెనీల రాకతో విశాఖ నగరం రూపురేఖలు మారిపోతాయని ఐటీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భౌగోళికంగా సముద్ర తీరాన ఉండటం, భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు అందుబాటులోకి రానుండటం.. ఐటీ కంపెనీల రాకతో ముంబై తరహా కాస్మోపాలిటన్ సిటీగా విశాఖ మారుతుందని అంటున్నారు.



### రాష్ట్రానికి పెట్టుబడులు

రాష్ట్రంలో యువతకు భరోసా ఇచ్చేలా పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక సంస్థలు ప్రతిపాదనలతో ముందుకు వస్తున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఎస్ఐపీబీ సమావేశంలో రూ.28,546 కోట్ల పెట్టుబడులు, 30,270 మందికి ఉద్యోగాల కల్పన ప్రతిపాదనలకు ఆమోద ముద్ర వేసింది. వీటిలో ప్రధానంగా రూ.1,202 కోట్లతో 6,571 మందికి ఉద్యోగాల కల్పన లక్ష్యంతో రేమండ్ ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. రేమండ్‌కు 80.77 ఎకరాలు కేటాయించారు. రూ.10,900 కోట్లతో రైవాడ వద్ద 900 మెగావాట్ల అదానీ పంప్డ్ స్టోరేజీ ప్లాంట్‌కూ ఆమోదం లభించింది.

# అమాత్య...కోసం మారారా

**ఏలూరు :** దెందులూరు టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చాపకింద నీరులా పనిచేసుకుపోతున్నారు. ఒకరకంగా చెప్పాలంటే ఆయన తన నాయకత్వాన్ని మరింతత పటిష్టం చేసుకునే దిశగా అడుగులువేస్తున్నట్లు కనపడుతుంది. వివాదాలకూ దూరంగా ఉంటున్నారంటే చింతమనేనిప్రభాకర్ కు పార్టీ పెద్దల నుంచి ఏదో సూన లాంటిది వచ్చినట్లే కనపడుతుంది. అందుకే చింతమనేని ప్రభాకర్ గత ఏడాది కాలంగా కాంట్రవర్సీ జోలికి వెళ్లకుండా తన పనులను మాత్రం నెరవేర్చుకుంటున్నారన్న కామెంట్స్ వినపడుతున్నాయి. చింతమనేని ప్రభాకర్ తెలుగుదేశంపార్టీలో ఫైర్ బ్రాండ్ లీడర్. గతంలో ఎప్పుడూ ఏదో ఒక వివాదంలో ఇరుక్కునే వారు. ఆయన వివాదంలో లేకపోతేనే నాడు వార్త అయ్యేది. కానీ నేడు ఏడాది నుంచి తన పనేదో తానుచేసుకుపోతున్నారంటే ఏదో ఉందన్నది పార్టీలోనూ, దెందులూరు నియోజవర్గం టీడీపీ క్యాడర్ లో జరుగుతున్న చర్చ. తెలుగదేశంపార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా చింతమనేని ప్రభాకర్ స్టయిల్ వేరుగా ఉంటుంది. వివాదాలే రాజకీయంగా ఆయన ఎదుగుదలకు అడ్డంకిగా మారాయన్నది వాస్తవం. పార్టీ అంటే పడిచచ్చిపోయే నేత కావడంతో చింతమనేని ప్రభాకర్ ను టీడీపీ నాయకత్వం దూరం పెట్టదు.చింతమనేని ప్రభాకర్ సీనియర్ రాజకీయ నాయకుడు. 2019 ఎన్నికల్లో చింతమనే ప్రభాకర్ దెందులూరు నుం ఓటమి పాలయ్యారు. ఆయనపై వైసీపీ ప్రభుత్వం అనేక కేసులు నమోదు చేసింది. జైలుకు కూడా వెళ్లి వచ్చారు. ఆ సానుభూతితో పాటు కూటమి హవా కూడా తోడవ్వడంతో 2024 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి అబ్బయ్యచౌదరిపై విజయం సాధించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత చింతమనేని ప్రభాకర్ పూర్తిగా సాధుజీవిగా మారారు. గతంలో అధికరారంలో ఉన్నప్పుడు, లేనప్పుడు చింతమనేనిని ఇలా చూడలేదన్నది పార్టీ కార్యకర్తల నుంచి వినిపిస్తున్న మాట. సన్నిహితుల సూచనలతో... 2014 ఎన్నికల్లో గెలిచిన తర్వాత అప్పటి ఎమ్మార్వో వనజాక్షిని బెదిరించిన వైనం చింతమనేని ప్రభాకర్ ను రాజకీయంగా ఇబ్బందులపాలు చేసింది. అంతేకాదు పార్టీ ప్రతిష్టను కూడా దిగజార్చింది. తర్వాత కూడా ఆయన తగ్గలేదు. 2019 ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆయనలో మార్పు వచ్చినట్లు కనిపిస్తుంది. తాను నిత్యం నిత్యం ప్రజల్లో ఉంటూ, సమస్యలను పరిష్కరిస్తున్నా ఎందుకు ఓటమి చెందానన్నది తనకే అర్థంకావడం లేదన్నది చింతమనేని ప్రభాకర్ సన్నిహితులవద్ద వ్యాఖ్యానిస్తుంటారట. అయితే వివాదాల వల్లనే ఆయనను జనం 2019 ఎన్నికల్లో దూరం పెట్టారని సన్నిహితులు చెప్పడంతో ఇప్పుడు ఆయన పెద్దగా కనిపించడం లేదు. అలాగనిపార్టీలోనూ, నియోజకవర్గంలో నూయాక్టివ్ గా లేద కాదు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తూ మంచిపేరు తెచ్చుకునే ప్రయత్నం నిరంతరం చేస్తున్నారు. ంశ్రీబనీ .. 2014 లో పార్టీ గెలిచినప్పుడు చింతమనేని ప్రభాకర్ కు మంత్రి పదవి దక్కకపోవడానికి వివాదాలే కారణమని అంటున్నారుర. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి సీనియర్ నేతగా ఉన్న ప్పటికీ ఆయనకు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినా పెద్దగా పదవులు దక్కలేదు. 2009, 2014లో వరసగా దెందులూరు నియోజకవర్గం నుంచి గెలిచిన చింతమనేని ప్రభాకర్ 2019 ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. అయినా పార్టీ కోసం జెండా వదలలేదు. కార్యకర్తలకు అండగా నిలబడటంలో ముందున్నారు. అనేక కేసులు తనపై నమోదవుతున్నా చింతమనేని ప్రభాకర్ బెదరలేదు. భయపడలేదు. పదవి రావాలంటే కొన్నాళ్ల పాటు కాంట్రవర్సీకి దూరంగా ఉండాలని అధినాయకత్వం చెప్పిన మాటలను ఆయన పాటిస్తున్నారట. తన ప్రత్యర్థి అబ్బయ్య చౌదరిపై కేసులు బనాయించి విదేశాలకు వెళ్లేలా చేసి నియోజకవర్గంపై తన పట్టును మరింత పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు.



## రప్పా రప్పా నరుకుతా'కు జగన్ వత్తాసా

-మొదటిపేజీ తరువాయి

**విశాఖపట్నం**



రప్పా..రప్పా నరుకుతామంటున్న వైసీపీ కార్యకర్తలను ఆ పార్టీ అధినేత జగన్ సమర్థించడం శోచనీయమని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. శుక్రవారం విశాఖలోని పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాన్ని ఆమె నిర్వహించారు. అనంతరం షర్మిల మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా జగన్ తీరుపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తంచేశారు. ఒక పార్టీకి అధ్యక్షుడిగా ఉన్న జగన్ ఆ తరహా వ్యాఖ్యలను సమర్థించడం ద్వారా సమాజానికి ఏం చెప్పదలుచుకుంటున్నారో అర్థం కావడం లేదన్నారు. హింసాత్మక వైఖరిని వ్యాప్తిచేసేలా జగన్ వ్యవహారశైలి ఉండడం దురదృష్టకరమన్నారు. నరికేస్తాం, చంపేస్తాం, బట్టలూడదీస్తామనే మాటలు ఒక నాయకుడు మాట్లాడాల్సినవి కావని, ఆ వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఖండిస్తోందని తెలిపారు. ప్రధాని మోదీ అండను చూసుకునే జగన్ బహిరంగంగా అరాచకాలు సృష్టిస్తున్నారన్నారు. జగన్ ముమ్మాటికీ మోదీ దత్తపుత్రుడేనన్నారు. బాబాయ్ వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించిన వ్యవహారాల్లో జగన్‌కు మోదీ మద్దతు ఉన్నదని షర్మిల ఆరోపించారు. ప్రధాని మోదీ విశాఖకు వచ్చి పోతున్నారేగానీ, ఈ ప్రాంతానికి, రాష్ట్రానికి ఏమీ చేయడం లేదన్నారు. విభజన హామీలను అమలు చేయని మోదీ రాష్ట్రానికి ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారని ఆమె ప్రశ్నించారు. రాష్ట్రానికి మోదీ వెన్నుపోటు పొడుస్తున్నా కేంద్రంలోని ప్రభుత్వానికి చంద్రబాబు సహకారాన్ని అందిస్తున్నారని విమర్శించారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా యోగాంధ్ర నిర్వహించడం అవసరమా?...అని షర్మిల వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో సీడబ్ల్యూసీ నేత కొప్పుల రాజు, విశాఖ జిల్లా పార్టీ ప్రెసిడెంట్ హాసినివర్మ పాల్గొన్నారు.

## వారిని ఓ కంట కనిపెట్టండి

-మొదటిపేజీ తరువాయి

ఉపముఖ్యమంత్రి పవన్ పోలీసులకు ఆదేశమిచ్చారు. అప్రజాస్వామిక ధోరణిలో మాట్లాడేవారిని ప్రజలు ఓ కంట కనిపెట్టాలని సూచించారు. జగన్ ఓదార్పు పర్యటనలో వైసీపీ నేతలు సృష్టించిన హడావుడి అంతా ఇంతా కాదు. 2029లో తాము అధికారంలోకి వస్తే రప్పా రప్పా నరికేస్తామంటూ పుష్ప డైలాగులతో కూడిన ప్లకార్డులు ప్రదర్శించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించి ఇద్దరు వ్యక్తుల మృతికి కారణమయ్యారు. ఈ విషయమై డిప్యూటీ సీఎం పవన్ ఘాటుగా స్పందించారు. సినిమాలో చెప్పే డైలాగులు సినిమా హాలు వరకూ బాగుంటాయి..వాటిని ఆచరణలో పెడతాము. ఆ డైలాగులకు అనుగుణంగా మేం ప్రవర్తిస్తాం అంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఇది ప్రజాస్వామ్యంలో సాధ్యం కాదని అన్నారు. ప్రజల్లో భయాందోళనలు రేకెత్తించే అసాంఘిక శక్తులపై కఠినంగా వ్యవహరించాలని పోలీసులకు ప్రభుత్వం ఇప్పటికే దిశానిర్దేశం చేసింది. ఎవరైనా చట్ట ప్రకారం నియమనిబంధనలను పాటించేలా చూడాలని సూచించింది. ఈ క్రమంలోనే ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా స్పందించారు. కూటమి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారిని ఉపేక్షించదని.. కచ్చితంగా అలాంటివారిపై రౌడీ షీట్లు తెరిచి అసాంఘిక శక్తులను అదుపు చేస్తామని అన్నారు. అశాంతిని, అభద్రతను కలిగించేవారికి మద్దతుగా అప్రజాస్వామిక ధోరణిలో మాట్లాడుతున్నవారి పట్ల కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వారిని ఓ కంట కనిపెట్టాలని పోలీసులను ఆదేశించారు. చట్ట విరుద్ధంగా ప్రవర్తిస్తామని బహిరంగంగా ప్రదర్శనలు చేసేవారిని కట్టడి చేయకపోగా.. వారిని సమర్థించేలా మాట్లాడేవారి నేరమయ ఆలోచనలను చేసేవారిని ప్రజలంతా గమనించాలి కోరారు. అసాంఘిక శక్తులకు మద్దతుగా మాట్లాడటం కూడా నేరమే అని మరచిపోకూడదని పేర్కొన్నారు.

## సందడిగా మారిన విశాఖ

-మొదటిపేజీ తరువాయి

సెలవులు ప్రకటించడం ద్వారా ట్రాఫిక్, జనసంద్రం వంటి సమస్యలను నివారించేందుకు చర్యలు తీసుకున్నారు. పర్యటనలో ఎలాంటి అవాంతరాలు ఎదురుకాకూడదనే ఉద్దేశంతో ముందస్తు చర్యల్లో భాగంగా, ఫిషింగ్ హార్బర్ నుంచి భీమిలి వరకు చేపల వేటపై నిషేధం విధించారు. అంటే ఈ రెండు రోజులు సముద్రంలో పడవలు కనిపించవు. ఎందుకంటే భద్రతే ముఖ్యం. ఇది మత్స్యకారులకు తాత్కాలిక అసౌకర్యంగా కనిపించినా, దేశ భద్రత పరంగా చూస్తే, అవసరమైన జాగ్రత్తే. ఈ కార్యక్రమాల్లో భాగంగా మరో ప్రాధాన్యత ఇచ్చిన అంశం.. ప్రత్యామ్నాయ వేదికగా ఆంధ్రా యూనివర్శిటీ క్యాంపస్‌లో కూడా ఏర్పాట్లు. అంటే మోదీ పర్యటన, వాతావరణ పరిస్థితులను బట్టి వేడుకల వేదికను మార్చే అవకాశం కూడా ఉంటుంది. అధికారులు ఎలాంటి అవాంతరం లేకుండా వేడుకలు సజావుగా జరిగేలా అన్ని కోణాల్లో ప్రణాళికలు సిద్ధం చేశారు.. ఈ వేడుకలు కేవలం యోగా ప్రదర్శనలు మాత్రమే కాదు. ఇది మన సంప్రదాయం, ఆరోగ్య జీవనశైలి, దేశ గౌరవం అన్నీ కలిసొచ్చే సందర్భం. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థులను భాగస్వాములుగా చేయడం ద్వారా ప్రభుత్వం వారి సామాజిక ప్రాధాన్యతను మరోసారి చాటిచెప్పింది. యోగా వంటి సంప్రదాయాన్ని అందరికీ చేరువ చేయడంలో ఇది ఒక చారిత్రక ముందడుగు అని చెప్పొచ్చు. విశాఖ నగరం ప్రస్తుతం పూర్తిగా యోగా మూడ్‌లోకి వెళ్లిపోయింది. రోడ్డులన్నీ శుభ్రంగా మెరిసిపోతున్నాయి. ఫ్లెక్సీలు, డెకరేషన్లు, బీచ్ రోడ్ వెంట ప్రత్యేక ఏర్పాట్లు నగరాన్ని మరోసారి వేడుకల నగరంగా మార్చాయి. అంతే కాదు, కేంద్రం నుండి పలువురు ఉన్నతాధికారులు, యోగా గురువులు, ఆయుర్వేద, నాటురోపతి రంగాల నిపుణులు కూడా విశాఖకు రానున్నారు. సారాంశంగా చూస్తే, ఈ యోగా డే వేడుకలు విశాఖను మరోసారి జాతీయ వార్తలకీ, ప్రపంచ దృష్టికీ తెస్తున్నాయి. బీచ్ సిటీగా మాత్రమే కాకుండా, ఆధ్యాత్మికత, ఆరోగ్య చైతన్యానికి కేంద్రంగా మారుతోన్న విశాఖకు ఇది ఒక పెద్ద గుర్తింపు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం, అధికారుల సమర్థ కార్యాచరణ, ప్రజల సహకారం.. ఇవన్నీ కలిసొస్తే విశాఖ నగరానికి మరింత పేరు ప్రఖ్యాతులు తీసుకురావడం ఖాయం. ఇప్పుడైతే చెప్పాలి.. విశాఖలో ఇప్పుడు ప్రతి శ్వాస యోగా శ్వాసే!

# లిక్కర్ లీడర్ల వంతు....

**తిరుపతి :** ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ కేసులో ఎప్పుడు ఏంజరుగుతుందన్నది ఆసక్తికరంగా మారింది. ఇప్పటి వరకూ ఈ కేసులో తొమ్మిది మంది అరెస్టయ్యారు. చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అరెస్ట్ తో ఇక వరసగా రాజకీయ నేతలు అరెస్టఅవుతారన్న ప్రచారం జరుగుతుంది. 2019 నుంచి 2024 మధ్య మద్యంవిక్రయాల్లో పెద్దయెత్తున కుంభకోణం జరిగిందని ప్రస్తుత కూటమి ప్రభుత్వం స్పెషల్ ఇన్విస్టిగేషన్ టీం ను ఏర్పాటు చేసింది. కొన్ని నెలల నుంచి దీనిపై సుదీర్ఘంగా దర్యాప్తు చేస్తున్న సిట్‌అధికారులు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఇచ్చిన క్లూ ఆధారంగా రాజ్ కేసిరెడ్డిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో రాజ్ కేసిరెడ్డి కీలక నిందితుడని పేర్కొన్నారు. ఇదే కేసులో రాజ్ కేసిరెడ్డి, చాణక్య, పైలా దిలీప్, సజ్జల శ్రీధర్ రెడ్డి, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్పలను సిట్ అధికారులు అరెస్ట్ చేశారు. ఇక తాజాగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కూడా అరెస్టయ్యారు. ఆయనతో పాటు చెవిరెడ్డి సన్నిహితుడు వెంకటేశ్ నాయుడును కూడా అరెస్ట్ చేశారు. ఇక ఇదే కేసులో రాజంపేట పార్లమెంటు సభ్యులు మిధున్ రెడ్డి పేరు బాగా ప్రచారంలో ఉంది. మిధున్ రెడ్డి ఇప్పటికే తనను అరెస్ట్ చేయవద్దంటూ ముందస్తు బెయిల్ కోసం న్యాయస్థానాన్నిఆశ్రయించారు. అదే సమయంలో ఈ కేసులో బిగ్ బాస్ పేరు కూడా ప్రముఖంగా వినిపస్తుంది. దీంతో చెవిరెడ్డి తర్వాత ఎవరు అరెస్టవుతారన్న దానిపై ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. లిక్కర్ స్కామ్ కేసులో 37, 38 నెంబరు నిందితులుగా ఉన్నవారిని అరెస్ట్ చేయడంతో ఇక తర్వాత ఎవరన్నది హాట్ టాపిక్ గా మారింది. కోట్లాది రూపాయలను విదేశాలకు తరలించారని ఇప్పటికే ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులు కూడా కేసు నమోదు చేశారు. రిమాండ్ లో ఉన్న ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్ప, రాజ్ కేసిరెడ్డిలను విచారించారు. మనీలాండరింగ్ జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో ఈడీ కూడా దర్యాప్తు చేస్తుంది. అయితే చెవిరెడ్డి అరెస్ట్ తో రాజకీయ నేతల అరెస్ట్ ల పర్వం ప్రారంభమయినట్లే కనిపిస్తుంది. ఇక దీంతో తర్వాత మిధున్ రెడ్డి ని అదుపులోకి తీసుకుంటారా? లేక అంతకంటే అత్యున్నత స్థాయి వ్యక్తిని అరెస్ట్ చేస్తారా? అని వైసీపీ నేతల్లో టెన్షన్ మొదలయింది.

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి టిడిపి ప్రభుత్వం కృషి





**సాగునీటి సంఘం అధ్యక్షుడు**

**కొండూరు అశోక్ రాజు**

**కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు**

**ఎంపీటీసీ సభ్యుడు గుంటమడుగు రఘురామరాజు**

**క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు**

**మాజీ సర్పంచ్ కొండూరు ఈశ్వర్ రాజు**

**స్వర్ణ సాగరం ఓజిలి, జూన్ 20:**

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ కృషి చేస్తుందని హెచ్ఎం ఎం నరేంద్ర, సాగునీటి సంఘం అధ్యక్షులు కొండూరు అశోక్ రాజు పేర్కొన్నారు. మండలంలోని ఆర్మేనిపాడు ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులతో కలిసి విద్యార్థులకు విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాగునీటి సంఘం అధ్యక్షులు అశోక్ రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తూ విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలలో ఒకటైన తల్లికి వందనం కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులందరికీ అందించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లకే దక్కుతుందన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేద ప్రజలకు తెలియజేశారు. గ్రామాల్లోని తల్లిదండ్రులు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని తెలియజేశారు.

**కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు**

**ఎంపీటీసీ సభ్యుడు గుంటమడుగు రఘురామరాజు**

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలను సాధించి వచ్చని ఎంపీటీసీ సభ్యుడు రఘురామరాజు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు కార్పొరేట్ కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నారని తెలియజేశారు. విద్యార్థులు చిన్నతనం నుంచి కష్టపడి చదువుకొని ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాంశాలలో ఉపాధ్యాయులు క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన చేస్తున్నారని చెప్పారు.

**క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు**

**మాజీ సర్పంచ్ కొండూరు ఈశ్వర్ రాజు**

విద్యార్థులు చిన్నతనం నుంచి క్రమశిక్షణ విద్యను అభ్యసిస్తే చక్కని ఫలితాలను పొందవచ్చునని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు పాఠశాల ప్రారంభమైన రోజే విద్యా సామగ్రిని పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. మధ్యాహ్నం భోజనం లో మెనూ తో కూడిన పౌష్టికాహారం విద్యార్థులకు అందించడం ఎంతో గొప్ప విషయం అన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నరేంద్ర, ఉపాధ్యాయులు సురేందర్ రెడ్డి, మల్లికార్జున, మల్లికార్జున రాజు చంద్రశేఖర్ రాజు, నాగమణి పాల్గొన్నారు.

# "164 ప్రదేశాలలో యోగా కార్యక్రమం"

**జయప్రదం చేయాలని ఇందుకూరుపేట ఎంపీడీవో విజ్ఞప్తి**

**ఇందుకూరుపేట స్వర్ణ సాగరం జూన్ 20**

అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని శనివారం మండలంలోని 164 ప్రదేశాలలో యోగా కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా కొత్తూరు జిల్లా పరిషత్ హైస్కూల్ లో నిర్వహించే కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు

# ప్రవైట్ పాఠశాలల ఫీజుల దోపిడిని అరికట్టాలి..

**డి ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర నాయకులు గుగులోతు సూర్య ప్రకాష్**

**డి ఎస్ ఎఫ్ ఐ డోర్నకల్ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల ఏం ఈ ఓ లక్ష్మణ్ కు వినతి పత్రం అందజేశారు**

**స్వర్ణ సాగరం డోర్నకల్ జూన్ 20**



డోర్నకల్ మండల కేంద్రంలో ప్రైవేట్ పాఠశాలల దోపిడిని అరికట్టాలని,అదే విధంగా పాఠశాలలో అధిక రేట్లకు పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న వారి పై చర్యలు తీసుకోవాలని అని డి ఎస్ ఎఫ్ ఐ డోర్నకల్ మండల కమిటి ఆధ్వర్యంలో మండల విద్యాధికారి లక్ష్మణ్ కు వినతిపత్రం అందజేశారు..ఈ సందర్భంగా డి ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర నాయకులు గుగులోతు సూర్య ప్రకాష్ మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రవైట్ పాఠశాలల దోపిడి రోజురోజుకు విపరీతంగా పెరిగిపోయాయని,అడ్డు అదుపు లేకుండా ప్రతి సంవత్సరం పెంచుకుంటూ విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గరి నుండి జలగ లాగా రక్తం పిండుతున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు....అదే కాకుండా పాఠశాల లోనే అధిక రేట్లకు పాఠ్యపుస్తకాలు విక్రయిస్తూ, ఎలాంటి అనుమతులు లేకుండా దందా నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి అని డిమాండ్ చేశారు...విద్య హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని,25 శాతం పేదలకు ఉచిత విద్య అందించాలని కోరారు....ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు...ఈ కార్యక్రమంలో డి ఎస్ ఎఫ్ ఐ మండల అధ్యక్షుడు బి.నరేష్,సురేష్,నవీన్,ఈశ్వర్,కళ్యాణ్,రామ్చరణ్,వినయ్, తరుణ్ తదితరులు ఉన్నారు

# తొమ్మిదవ వార్షిక శిక్షణ శిబిరానికి హాజరైన ఎన్సిసి క్యాడేట్లు



**విద్యానగర్ స్వర్ణసాగరం జూన్ 20**


విద్యానగర్లోని ఎన్.బి.కె.ఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో జూన్ 20 నుండి జూన్ 29 వరకు 10 రోజులపాటు నేవల్ ఎన్సీసీ తొమ్మిదవ వార్షిక శిక్షణా శిబిరం నిర్వహించబడుతోంది. ఈ శిబిరానికి నెల్లూరు, తిరుపతి, కడప, గుంటూరు, ప్రకాశం, అనంతపురం జిల్లాల నుంచి 600 మంది ఎన్సీసీ క్యాడెట్లు హాజరు అయ్యారు.ఈ శిక్షణ శిబిరంలో క్యాడెట్లకు నేవల్ ఓరియంటేషన్, నేవల్ కమ్యూనికేషన్, సీమెన్షిప్, సెమాఫోర్, డ్రిల్, ఫైరింగ్, పరేడ్ ఫార్మాలిటీస్, లీడర్షిప్, వ్యక్తిత్వ వికాసం, జాతీయ సమైక్యత,సామాజిక చైతన్య ర్యాలీలపై సమగ్ర అవగాహన కల్పించనున్నారు.శిబిరానికి అవసరమైన అన్ని వసతులను అందించినందుకు ఎన్బికెఆర్ సంస్థ కరస్పాండెంట్ రామ్కుమార్కు శిబిరాధికారి లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గొడంగవే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కాలేజ్లో ఫైరింగ్ రేంజ్, అబ్సటెకిల్ ట్రైనింగ్ సౌకర్యాలు వంటి ప్రత్యేకమైన వసతులు ఉండడం విశేషం. ఇటువంటి వసతులు ఇతర కళాశాలల్లో లభించవు.ఈ సంస్థ నుండే గత 3 సంవత్సరాలు వరుసగా ముగ్గురు ఆర్డిసి (రిపబ్లిక్ డే కాంటిజెంట్) క్యాడెట్లు ఎంపిక కావడం గర్వకారణం. గత నాలుగు సంవత్సరాలుగా ఎన్బికెఆర్ క్యాంపస్లో శిక్షణా శిబిరాలను విజయవంతంగా నిర్వహించేందుకు మద్దతు ఇస్తున్న డైరెక్టర్ మరియు కరస్పాండెంట్కు 10(A) నేవల్ యూనిట్ ఎన్ సీసీ లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గొడంగవే కృతజ్ఞతలు తెలిపారు.ఈ శిబిరానికి సబ్ లెఫ్టినెంట్ డాక్టర్ వి. మల్లికార్జున రెడ్డి క్యాంప్ అడ్జుటెంట్గా నియమించ బడ్డారు. శిబిరానికి హాజరు కాబడ్డ విద్యార్థులకు క్యాంపునకు సంభందించిన వివరాలను , సూచనలను, విధి విధానాలను వివరించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి. విజయ్ కుమార్ రెడ్డి మట్లాడుతు ఇలాంటి కార్యక్రమములు తమ కళాశాలయందు నిర్వహించడము చాలా సంతోషకరమైన విషయం అని , అలాగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని (జూన్ 21) పురస్కరించుకుని, తమ కళాశాల క్యాంపస్లో 600 మంది విద్యార్థులతో యోగా ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఈ శిక్షణా కార్యక్రమంలో వివిధ పాఠశాలల కళాశాలల అసోసియేట్ ఎన్ సి సి అధికారులు, పి ఐ స్టాఫ్ ఎన్సిసి క్యాడేట్లు పాల్గొన్నారు.

# "సర్వేపల్లి ప్రజాక్షేత్రంలో ప్రజా ప్రతినిధుల కోడలు కుమార్తెలు "

**ఇంటింటి పలకరింపులో సోమిరెడ్డి కోడలు శృతి**

**కాకాణిబాటలోకుమార్తె పూజిత**

**తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం జూన్ 20**





సర్వేపల్లి నియోజకవర్గంలో ప్రజాక్షేత్రంలో విద్యావంతులైన యువతులువారి వారి ధోరణిలో ప్రజలకు దగ్గరయ్యేందుకుప్రయత్నించడం పట్ల నియోజకవర్గంలో వీరిని గురించి చర్చించుకోవడం జరుగుతుంది. నియోజకవర్గంలోని ఐదు మండలాలు తోటపల్లి గూడూరు వెంకటాచలం ముత్తుకూరు మనుబోలు పొదలకూరు మండలాలలో ఆయా గ్రామాలలో ఏడాది పాలన ముగియడంతో శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కోడలు నియోజకవర్గ సమన్వయ నేత రాజగోపాల్ రెడ్డి సతీమణి శృతి రెడ్డి ఇంటింటి పలకరింపు కార్యక్రమంలో స్థానిక సమస్యలు తెలుసుకుంటూ పరిష్కార మార్గం వివరిస్తూ కూటమిపాలన విధానాలను వివరిస్తూ ముందుకు పోతుంది ప్రధానంగా నియోజకవర్గంలో పేద వర్గాల మహిళలకు ఆర్థిక ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ప్రణాళిక బద్ధమైన ఆలోచనతో ముందుకు పోతుంది.

ఆయా గ్రామాలలో మహిళలు స్థానిక నేతలతో సమన్వయంగా మాటా మంచితో ఆప్యాయంగా కలుపుగోలుతనంగా వ్యవహరించడం స్థానికులను ఆకర్షిస్తుంది గత శాసనసభ ఎన్నికల్లో తమ మామకు టికెట్ ఖరారు కావడంలో ఆలస్యం సమయంలో శృతి రెడ్డి పేరు ప్రముఖంగా వినిపించడం జరిగింది ఆ తర్వాత తన మామ విజయం కోసం నియోజకవర్గంలో ప్రచారంలో దూసుకుపోవడం జరిగింది.ప్రస్తుతం ఆమె తన భర్తరాజగోపాల్ రెడ్డితో కలిసి ఇంటింటి పలకరింపు కార్యక్రమం చేపట్టడం భవిష్యత్తులోఅనేక ఊహాగానాలకు తావిస్తున్నట్లు నియోజకవర్గ వాసులు భావిస్తున్నారు. ఇక మాజీ మంత్రి సర్వేపల్లి మాజీ శాసనసభ్యులు కాకాణిగోవర్ధన్ రెడ్డి కుమార్తె పూజిత గత ఎన్నికలలో తండ్రి విజయం కోసం విస్తృత ప్రచారం చేయడం జరిగింది.తండ్రి అరెస్టు తరువాతరెట్టింపైన ఉత్సాహంతో తన తండ్రి నిర్దోషిగబయటకు వస్తారని అక్రమ కేసులకు భయపడేది లేదని తనదైన శైలిలో నియోజకవర్గంలో అన్ని మండలాలలో పర్యటిస్తూ దేవాలయాల్లోపూజలు నిర్వహిస్తూవైకాపాశ్రేణుల్లో ధైర్యాన్ని నింపుతూ ముందుకు పోవడంతోతండ్రి బాటలోపయనించడం ఆ పార్టీ నేతలునాయకుల్లోమనోధైర్యంకలిగించడంలో తన శక్తిని చాటుకోవడాన్నిఆ పార్టీ కార్యకర్తలు స్వాగతిస్తున్నారు.

మొత్తం మీద సర్వేపల్లి నియోజకవర్గంలో శృతి పూజితలప్రచార పర్యటనలు ఆసక్తికరంగా మారాయి

తిరుపతి
చిత్తూరు నెల్లూరు అనంతపురం
విలేకరులు కావలెను
సంప్రదించండి : 9440352036

# "తల్లికి వందనం"ఇచ్చిన హామీని నెరవేర్చిన 'కూటమి ప్రభుత్వం '



**విద్యామంత్రి నారా లోకేష్ కు అభినందనలు**

**బుచ్చిరెడ్డిపాలెం స్వర్ణ సాగరం జూన్ 20**

ఇచ్చిన వాగ్దానం తల్లికి వందనం అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం తన హామీని నిలబెట్టుకుందని శ్రీ గోపాల కృష్ణయ్య పాఠశాల కరస్పాండెంట్ నేలనూతల శ్రీధర్ పేర్కొన్నారు. తమ పాఠశాలలో 90% తల్లికి వందనం జమ అయినట్లు ఆయన తెలిపారు. దీని కారణంగా తల్లిదండ్రులకు తమ పిల్లల అవసరాలు తీర్చేందుకు ఎంతో ఉపయోగపడినట్లు తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు తల్లిదండ్రులతో పాటు పాఠశాల యాజమాన్యం ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సురేఖ విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# రైతులు జాయింట్ పట్టాను విడివిడిగా విభజన చేయించుకోండి

**బంగారుపాళ్యం.స్వప్నసాగరం.జూన్ 20**



చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండలంలో రీ–సర్వే పూర్తైన గ్రామాలలో వెబ్ ల్యాండ్ 2.0 లో జాయింట్ పట్టాదారులుగా నమోదు అయిన భూ యజమానులకు సంతోషకర సమాచారాన్ని ప్రభుత్వం తెలిపినట్లు తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ తెలిపారు.రీ – సర్వే పూర్తి కాబడిన గ్రామముల యందు వెబ్ ల్యాండ్ 2.0 లో జాయింట్ పట్టాదారులుగా నమోదు కాబడిన భూ యజమానులు వారి యొక్క భూములను విభజన చేయుటకు ప్రభుతము వారు నిర్దేశించిన 500 రూపాయల రుసుమును పూర్తిగా మినహాయించి ఉచితముగా ఈ సేవను పొందుటకు అవకాశము కల్పించియున్నారు. దీనికి గాను కేవలము నామమాత్రపు దరఖాస్తు రుసుము 50 రూపాయలను గ్రామ సచివాలయము నందు చెల్లించి జూన్ 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.ఈ సదవకాసమును జాయింట్ పట్టాదారులు అందరూ ఉపయోగించుకొని జాయింట్ పట్టాలను విడివిడిగా విభజన చేయించు కోవలసినదిగా కోరారు. దీనివలన ప్రభుత్వ సంక్షేమ పథకములైన "అన్నదాత సుఖీభవ" "తల్లికి వందనం" ఇతర ప్రభుత్వ సంక్షేమ పదకములకు అర్హులుగా గుర్తించబడుదురు. "అన్నదాత సుఖీభవ" పథకములో ఇబ్బంది వున్నవారు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకుంటే ప్రాధాన్యత ఇవ్వబడునని తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ తెలియజేశారు

# చెట్టుని ఢీకొన్న కారు ఓ వ్యక్తి మృతి.







**కొడవలూరు, స్వర్ణసాగరం జూన్.20:**

నెల్లూరు జిల్లా,కోవూరు నియోజకవర్గం, కొడవలూరు మండలం రాచర్లపాడు జాతియ్యాం హదరి పై రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అతివేగంగా వెళుతున్న కారు చెట్టును ఢీ కొనడం జరిగింది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి వ్యక్తి మృతి చెందగా నలుగురికి తీవ్ర గాయాలు అయినాయి, ఈ వాహనం హైదరాబాద్ నుండి తిరుపతికి వెళుతుండగా ప్రమాదం జరిగినట్టు వాహన చోదకులు వాపోయారు,గాయపడిన వారిని 108 వాహనం ద్వారా నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు హైవే మొబైల్ సిబ్బంది తరలించారు.

## నారా భువనేశ్వరి పుట్టినరోజు సందర్భముగా ఎన్టీఆర్ ట్రస్టులో రక్తదానం చేసిన భాష్యం వంశీ






**బంగారుపాళ్యం.స్వర్ణసాగ రం.జూన్ 20**

బంగారుపాళ్యం మండల పరిధిలోని గుంతూరు గ్రామ పంచాయతీ కి చెందిన బాష్యం వంశీ చౌదరి ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ నారా భువనేశ్వరి పుట్టినరోజు సందర్భముగా గురువారం నాడు ఎన్టీఆర్ ట్రస్టులో రక్త ధానం చెయ్యడం చాలా సంతోషంగా ఉందని భాష్యం వంశీ తెలియజేశారు ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా అనేక పేద ప్రజలకు రక్తదానం ద్వారా పేద ప్రజల ప్రాణాలు కాపాడగలరని తెలియజేశారు ఈ ట్రస్టు ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహించాలని, నారా భువనేశ్వరి పుట్టినరోజు ఆ భగవంతుడు ఆమెకు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలు ప్రసాదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్టు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గుంతూరు గ్రామ ప్రజలు,స్నేహితులు, తదితరులు పాల్గొన్నారు

## జల భగీరథుడు చిత్తూరు జిల్లా జడ్పీచైర్మన్



**వి.కోట స్వర్ణ సాగరం జూన్20**

చిత్తూరు జిల్లా వి.కోట మండలం, ముదరందొడ్డి పంచాయతీ, చిన్నాగనపల్లి గ్రామానికి గత కొద్ది కాలంగాత్రాగు నీరు సమస్య తో గ్రామ సభ్యులంతా కలిసి చిత్తూరు జిల్లా జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు వారికి వారి బాధను విన్నవించుకున్నారు. వెంటనే స్పందించి జడ్పి నిధిలతో నూతనంగా బోరు వేయించారు మీరు సమృద్ధిగా రావడంతో బోరు బావికి సంబంధించిన మోటార్, స్టార్టర్, పంప్ సెట్, పైపులు, ఎలక్ట్రిక్ కేబల్ లను జడ్పి నిధుల ద్వారా మంజూరు చేసి నేడు అందించి వాటి ద్వారా నీరు బయటికి తీసుకొచ్చి జన దాహం తీర్చారు. గ్రామ ప్రజలు ఎంతో ఆనందంతో జడ్పిచైర్మన్ జి.శ్రీనివాసులు(వాసు) వారిని ఎంతో అభినందించారు. జలదాత సుఖీభవ అంటూ జలదాత అపర భగీరథుడు అని సన్మానించారు.ఈకార్యక్రమంలో కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి యువ నాయకుడు సురేష్ గౌడ,వైస్ ఎంపిపి లక్ష్మణ్ రెడ్డి , వైస్ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, కన్వీనర్ రాధాకృష్ణ రెడ్డి, వార్డ్ సభ్యులు శేషప్ప, మునిస్వామి, నాయకులు మోహన్ గౌడా , తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మైనింగ్ పై కఠిన చర్యలు తప్పవు





**వరదయ్యపాలెం స్వర్ణ సాగరం జూన్ 20**

అనుమతులు లేకుండా అక్రమంగా మైనింగ్ చేపట్టి, రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.వరదయ్యపాలెం మండలంలో మైనింగ్ అధికారులు పలుచోట్ల తనిఖీ నిర్వహించారు. మైనింగ్ చట్టాలను ఉల్లంఘిస్తూ భూములను విక్రయించి అక్రమ మైనింగ్ కు దారి తీసిన భూస్వాములు,అలాగే అటువంటి భూములను కొనుగోలు చేసి మైనింగ్ జరిపిస్తున్న వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ప్రజల ఆరోగ్యంపై,పర్యావరణంపై దీని ప్రభావం తీవ్రంగా ఉండడంతో,ఇలాంటి అక్రమ కార్యకలాపాలను సహించేది లేదని అధికారులు తెలిపారు.ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి, అక్రమ మైనింగ్ కు పాల్పడుతున్న యంత్రాలను సీజ్ చేసినట్టు సమాచారం.భవిష్యత్ లో ఈ రకమైన చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడకుండా జాగ్రత్త పడాలని, లేకపోతే శిక్ష నుంచి తప్పించుకునే వీలుండదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో,రెవిన్యూ, పంచాయతీ రాజ్,పోలీస్,తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శ్రీసిటీని సందర్శించిన ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ







### - పరిశ్రమల ప్రతినిధులతో సమావేశం

### - విద్యుత్ వినియోగం, సరఫరా సమస్యలపై సమీక్ష

**శ్రీసిటీ, స్వర్ణ సాగరం జూన్ 20, 2025:**

ఏపీ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ (ఏపీఎస్పీడీసీఎల్) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావ్ శుక్రవారం శ్రీసిటీని సందర్శించారు. ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (టెక్నికల్) కాకర్ల గురవయ్య ఏపీ ట్రాన్స్కో డైరెక్టర్ (టెక్నికల్) జె.వెంకటేశ్వరరావుతో కలసి వచ్చిన స్థానిక బిజినెస్ సెంటర్ లో విద్యుత్ సిబ్బంది, పరిశ్రమల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమల విద్యుత్ వినియోగం, సరఫరా సమస్యలపై సమీక్ష చేశారు. పరిశ్రమల ప్రతినిధులు తమ దృష్టికి తీసుకొచ్చిన విద్యుత్ అంతరాయం, వోల్టేజ్ సమస్యలు, అప్రకటిత విద్యుత్ కోతలు, సోలార్ విద్యుత్ ఉత్పత్తి సంబంధిత సమస్యలపై చర్చించారు. చర్చకు వచ్చిన అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే పరిశ్రమల లోపల తరచుగా విద్యుత్ వ్యవస్థల నిర్వహణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. తద్వారా ప్రస్తుతం ఎదుర్కొంటున్న పలు సమస్యలు ఉత్పన్నం కాకుండా నివారించవచ్చని పేర్కొన్నారు. టెక్నికల్ విభాగానికి చెందిన విద్యుత్ అధికారులు మాట్లాడుతూ పరిశ్రమలు ఉపయోగించే విద్యుత్ వ్యవస్థలు, విధానాలలో తలెత్తే కొన్నిలోపాలను వివరించడంతో పాటు చేయాల్సిన చేయకూడని పనులను సూచించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసినందుకు విద్యుత్ అధికారులకు శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ పరిశ్రమలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలు విని, వాటి పరిష్కారం కోసం ఆయన చూపుతున్న ఆసక్తి, సులభతర వ్యాపారానికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను స్పష్టం చేస్తోందన్నారు. ఏపీఎస్పీడీసీఎల్ తీసుకుంటున్న వినూత్న చర్యలు తప్పక సత్ఫలితాలు ఇస్తాయన్నారు. విద్యుత్ అంతరాయాలు మరియు ప్రమాదాలను నివారించడానికి, పవర్ ఇన్స్టాలేషన్ ప్రక్రియలో సరైన కాంట్రాక్టర్లు, నాణ్యమైన పరికరాలను ఎంపిక చేసుకోవాలని పరిశ్రమ వర్గాలకు ఆయన పిలుపునిచ్చారు.సమావేశానికి విచ్చేసిన అధికారులు, ప్రతినిధులకు సాదర స్వాగతం పలికిన శ్రీసిటీ ఎలక్ట్రికల్ హెడ్ డి.ఎన్.రెడ్డి, ఈ సమావేశం ఉద్దేశం, లక్ష్యాలను వివరించారు. సమస్యలను CMD దృష్టికి తెచ్చి, చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని పరిశ్రమ ప్రతినిధులను కోరారు.

# ఘనంగా రెవెన్యూ డే దినోత్సవం...





**ఏర్పేడు స్వర్ణ సాగరం:-**

జూన్ 20న రెవెన్యూ డే దినోత్సవం సందర్భంగా ఏర్పేడు రెవెన్యూ కార్యాలయంలో తాసిల్దార్ భార్గవి అధ్యక్షతన కేక్ కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ రికార్డుల ప్రదర్శన ఏర్పాటు చేశారు. సుదీర్ఘంగా సేవలందిస్తున్న పలువురి రెవెన్యూ సిబ్బందిని సత్కరించారు. రెవెన్యూ శాఖలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా తాసిల్దార్ భార్గవి మాట్లాడుతూ రెవెన్యూ వ్యవస్థ ప్రజలకు అందించే సేవలు ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ ప్రేమసాయి, శ్రీనివాస్, ఆర్ ఐ సుబ్రమణ్యం, రోజా, హరి ప్రసాద్,పల్లం రాజా వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు

## రోడ్డు సమస్యను పరిష్కరించాలని మండల అధ్యక్షుడు బి ఎం కిషోర్ గౌడ్ ని కలిసిన రామసముద్రం గ్రామస్తులు





**స్వర్ణ సాగరం బైరెడ్డిపల్లి జూన్ 20:-**

చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం బైరెడ్డిపల్లి మండలం నందు కైగల్ నుండి రామసముద్రం మీదుగా సనిపల్లి వరకు ఐదు కిలోమీటర్ల మేర రోడ్డు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు ఈ విషయంగా రామసముద్రం మునిపల్లి ఎం కొత్తూరు సనిపల్లి గ్రామస్తులు బైరెడ్డిపల్లి మండల అధ్యక్షుడు కిషోర్ గౌడ్ ని కలిసి ఈ రోడ్డును పూర్తి చేయాలని కోరడమైనది అదేవిధంగా ఈ రోడ్డుకు ఏడు సంవత్సరాల క్రితం జల్లిపరచి తారు వేయలేకపోయారు ఈ విషయాన్ని కిషోర్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన తొందరలో అనగా 6 నెలల్లో రోడ్డు పనులు పూర్తి చేస్తామని గ్రామస్తులకు తెలియజేయడం జరిగింది.

## జననం నుంచి మరణం వరకు అనేక సేవలతో నిత్యం ప్రజలతో మమేకమైన గొప్ప చరిత్ర రెవెన్యూశాఖదే






**వరదయ్యపాలెం స్వర్ణ సాగరం జూన్ 20**

నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ కార్యాలయ%శీ% చుట్టు ప్రదక్షణ చేసే సంప్రదాయానికి స్వస్తి చెప్పండి .రెవెన్యూ దినోత్సవంలో వరదయ్యపాలెం తహశీల్దార్ సుధీర్ రెడ్డి సందేశం .వరదయ్యపాలెం తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు కోసి పంచి పెట్టారు. నిత్యం ప్రజలతో మమేకమై అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తహశీల్దార్ సుధీర్ రెడ్డి రెవెన్యూ ఉద్యోగుల చేత ప్రతిజ్ఞ చేయించారు.మనిషి పుట్టిన నాటి నుంచి మరణం వరకు వివిధ ధృవీకరణపత్రాలు, భూసమస్యలు, ఇంటి పట్టాలు రేషన్ కార్డులు వివిధ సంక్షేమ పథకాలను మంజూరులో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న రెవెన్యూ శాఖలో పని చేస్తున్నందుకు గర్వపడుతూ ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోకుండా అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని తహశీల్దార్ సుధీర్ రెడ్డి రెవెన్యూ ఉద్యోగులు వీఆర్వో లను సిబ్బందిని కోరారు

# అంబరాన్ని అంటిన కోలా ఆనంద్ జన్మదిన వేడుకలు





స్వర్ణ సాగరం- శ్రీకాళహస్తి

కోలా ఆనంద్ జన్మదిన వేడుకలు శ్రీకాళహస్తి పట్టణంలోని త్రిశూలంబ గుడి దగ్గర బాలాజీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ జన్మదిన వేడుకలు అంబరాన్ని అంటే విధంగా కోలాహలంగా యువకులు ఉత్సాహంగా కోల ఆనంద్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ పేదల పెన్నిధి అన్నా అంటే నేనున్నానంటూ ఆపదలో ఉన్న వాళ్ళని ఆదుకుంటున్న గొప్ప మనసున్న వ్యక్తి అంటూ బాలాజీ ఆనంద్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం భారీ కేకు కట్ చేసి బాణా సంచారంతో స్వాగతం పలుకుతూ 500 మందికి అన్నదానం ఏర్పాటు చేశారు. ఆనంద్ అన్న చేతుల మీదుగా నిరుపేదలకు అన్నదానం చేయించారు. ఈ కార్యక్రమంలో మమత, సిద్దు రాయల్, సాయి, నవీన్, పోలా ఆనంద్ యువత, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# యాక్సిడెంట్ కేసు కొట్టివేత

స్వర్ణసాగరం-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి పట్టణానికి సమీపంలోని బసవయ్య పాలెం చెక్ పోస్టు వద్ద 2017లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా అందుకు బాధ్యున్ని చేస్తూ బీహార్ కు చెందిన లారీ డ్రైవర్ పై టూ టౌన్ పోలీసులు నమోదు చేసిన కేసును శుక్రవారం శ్రీకాళహస్తి కోర్టు కొట్టి వేసింది. సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంతో సెక్షన్ 304–ఏ, 338 ఐపీసీ కింద నమోదైన కేసులో నిందితున్ని న్యాయమూర్తి జోరేపల్లి కృష్ణ ప్రియ అపరాదిగా నిర్ధారిస్తూ తీర్పునిచ్చినట్లు డిఫెన్స్ క్రిమినల్ లాయర్ విప్పరపల్లి సాయిరాం తెలిపారు. “ వెయ్యి మంది దోషులు తప్పించుకున్నా.. ఒక్క నిర్దోషి కూడా శిక్షింప బడకూడదు “ అన్న సిద్ధాంతంతో ముందుకెళ్లడమే ఓ న్యాయవాదిగా తన ముందున్న లక్ష్యమని సాయి రామ్ తెలిపారు. పేదల పక్షాన న్యాయ పోరాటం చేసేందుకు తానెప్పుడూ సిద్ధంగా ఉంటానని తెలిపారు.

# 23న శ్రీకాళహస్తికి షర్మిల రాక

స్వర్ణ సాగరం-శ్రీకాళహస్తి

జిల్లాల పర్యటనలో భాగంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి ఈ నెల 23న శ్రీకాళహస్తికి రానున్నారు. ఆ పర్యటన వివరాలను స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణంలో ర్యాలీ అనంతరం స్థానిక ఆర్జిఆర్ కళ్యాణ మండపంలో షర్మిల సభ ఉంటుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బాల గురవం బాబు, నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. పార్టీని సంస్థాగతంగా అభివృద్ధి చేయుటపై జిల్లాస్థాయి విస్తృత సమావేశంలో షర్మిల దిశా నిర్దేశం చేయడం జరుగుతుందని అన్నారు. ఈ నెల 13న జరగాల్సిన షర్మిల సభ అహ్మదాబాద్ విమాన ఘటన కారణంగా రద్దు చేయబడింది.

# ముక్కంటి హుండీ ఆదాయం రూ.1. 45కోట్లు



స్వర్ణ సాగరం-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వర స్వామీ అమ్మవార్లకు, పరివార దేవతలకు భక్తులు సమర్పించిన హుండీ ఆదాయం ఒక కోటీ 45 లక్షలా 39 వేలా 576 రూపాయలు వచ్చింది. స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం హుండీ లెక్కింపులు జరిగాయి. బంగారం 0.39 గ్రాములు, వెండి 503.13 కిలోలు, 106 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చినట్లు డిప్యూటీఈవో కృష్ణారెడ్డి తెలిపారు.

# ఇందిరా నగర్ లో ప్రత్యేక పల్లె పండుగ పై విచారణ.





## తిరుపతి ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ అధికారి పర్యటన

వరదయ్యపాలెం స్వర్ణ సాగరం జూన్ 20

ఇందిరానగర్ లో నిర్వహించిన ప్రత్యేక పల్లె పండుగ పై అధికారులు విచారణ చేపట్టారు.తిరుపతి ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ అధికారి రామ్ మోహన్ స్వయంగా సందర్శించి పలు అంశాలను పరిశీలించారు.ఈ సందర్భంగా పండుగ సందర్భంగా ఏర్పాట్లు, ఖర్చులు, నిర్వహణపై లోతుగా పరిశీలించారు.విచారణలో పలు కీలకమైన అంశాలను గుర్తించిన అధికారులు,వాటిపై త్వరలో జిల్లా ఉన్నత అధికారికి నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు.ప్రజా ఫిర్యాదుల నేపథ్యంలో ఈ పరిశీలన చేపట్టినట్లు సమాచారం.స్థానిక ప్రజలు కొన్ని అవకతవకలపై ఆరోపణలు చేయగా, వాటి స్థితిగతులపై సమగ్రంగా అవగాహన చేసుకున్నారు.పల్లె అభివృద్ధి పేరిట జరిగే కార్యక్రమాలు పారదర్శకంగా,ప్రజలకు లాభపడేలా ఉండాలనే ఉద్దేశంతో ఈ విచారణ కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.ఈ విచారణ లో అర్జీదారు ఆశా,పి ఆర్ ఏఈ నాగరాజు,ఇంచార్జి హేమ,ఈ ఏ కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రెవెన్యూ దినోత్సవం








## కనిగిరి ఆర్డీఓ కేశవర్ధన్ రెడ్డి

కనిగిరి స్వర్ణ సాగరం జూన్ 20

ప్రజాస్వామ్యంలో రెవెన్యూ శాఖ అత్యంత కీలకమైనదని కనిగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి కేశవర్ధన్ రెడ్డి అన్నారు.రెవెన్యూ దినోత్సవమును పురస్కరించుకొని శుక్రవారం కనిగిరి రెవెన్యూ డివిజనల్ పరిధిలోని రెవెన్యూ శాఖ అధికారులందరితో కలిసి కనిగిరి రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది.తొలుత కనిగిరి రెవెన్యూ కార్యాలయం నుండి పామూరు బస్టాండ్ వరకు నినాధాలతో ఫ్లకార్డ్స్ భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది.అనంతరం రెవెన్యూ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మీటింగ్ లో కనిగిరి రెవెన్యూ శాఖ డివిజనల్ అధికారి కేశవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ బ్రిటీష్కాలం నుంచి ప్రభుత్వానికి,ప్రజలకు వారధిగా రెవెన్యూశాఖ పనిచేస్తోందన్నారు.ఆనాటి నుంచి నేటివరకు ప్రజాపరిపాలనలో రెవెన్యూ శాఖ అత్యంత కీలకంగా పనిచేస్తోందని వివరించారు. రెవెన్యూశాఖ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకే రెవెన్యూ దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుందన్నారు.ప్రతి రెవెన్యూ ఉద్యోగి రోజు రోజుకు విజ్ఞానాన్ని పెంపొందించుకొని విధులు నిర్వహిస్తే అద్భుతమైన ఫలితాలు పొందవ చన్నారు .సమాజంలో ఏ సంక్షోభం ఎదురైనా తొలుత రెవెన్యూ శాఖ స్పందించి సమస్య పరిష్కరించేందుకు సిద్ధంగా ఉంటుందన్నారు. అనంతరం రెవెన్యూ సర్వీసులల్లో ఉత్తమ సేవలందించిన సిబ్బందికి మరియు కనిగిరి రెవెన్యూ శాఖ అధికారిని తహసీల్దార్లు అందరూ కలిసి శాలువాలతో ఘనంగా సత్కారిం చడం జరిగింది.ఈ కార్యక్రమంలో కనిగిరి రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీల్దార్ లు రెవెన్యూ శాఖల అధికారులందరు పాల్గొన్నారు.

# శివుని సేవలో ప్రముఖులు



స్వర్ణ సాగరం-శ్రీకాళహస్తి

స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయానికి పలువురు ప్రముఖులు శుక్రవారం విచ్చేశారు. నేషనల్ కమిషనర్ ఆఫ్ ఉమెన్స్ న్యూఢిల్లీ డాక్టర్ అర్చన మంజుందర్, తెలంగాణ హైకోర్టు జడ్జి పుల్లా కార్తీక్, ఏపీ ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ దారు నాయక్ వీరిలో ఉన్నారు. స్వామి అమ్మవార్ల చెంత ప్రత్యేక పూజలు చేసుకున్నారు. గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలికి ముక్కంటి తీర్థప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు.

# వేర్వేరు ఘటనలలో ఇద్దరు దొంగలు అరెస్టు

స్వర్ణ సాగరం-శ్రీకాళహస్తి



ఇళ్లల్లో చోరీలు, బైకు దొంగతనాల కేసుల్లో ఇద్దరు దొంగలను టూ టౌన్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. టూ టౌన్ పరిధిలోని కైలాసగిరి కాలనీ, జర్నలిస్ట్ కాలనీలో గతేడాది ఇళ్లల్లో చోరీలు జరిగాయి. ఈ చోరీల్లో నిందితుడుగా ఉన్న కావడి సోమశేఖర్(29) పీలేరు సబ్ జైలు నుంచి పీటీ వారెంట్ కింద అరెస్టు చేసి తీసుకొచ్చారు. అదేవిధంగా బహుదూర్ పేట, ఇతరత్రా ప్రాంతాల్లో బైకు దొంగతనాలకు పాల్పడిన అదంషా(17) అనే దొంగను వాహన తనిఖీల్లో అరెస్టు చేశారు. ఒకరు పారిపోయారు. ఇరువురిని శ్రీకాళహస్తి కోర్టులో హాజరపరచగా న్యాయమూర్తి 15 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు.

# ఎస్టీకే నగర్ లో డ్రగ్స్ కలకలం





## పోలీసుల దాడి ... పరారైన యువకులు

స్వర్ణ సాగరం-శ్రీకాళహస్తి

పట్టణంలోని దక్షిణ కైలాస నగర్ శివారు ప్రాంతంలో ఉన్న ఓ ప్రైవేట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కు సమీపంలో యువత గంజాయి, డ్రగ్స్, మద్యం సేవిస్తున్నట్లు స్థానికుల నుంచి టూ టౌన్ పోలీసులకు శుక్రవారం సమాచారం అందింది. ఆ మేరకు పోలీసులు దాడి చేయగా యువకులు పరారయ్యారు. ఘటనా స్థలంలో ద్విచక్ర వాహనంతో పాటు డ్రగ్స్ కు వినియోగించే మైక్రో సిరంజిలు, నీడిళ్ళు, మద్యం బాటిల్లు, గంజాయి బీడీలు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకొని స్టేషన్ కు తరలించారు. ద్విచక్ర వాహనం ద్వారా మత్తు పదార్థాలు సేవిస్తున్న యువకుల ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు సిఐ నాగార్జున రెడ్డి తెలిపారు.

# సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్





## పర్యవేక్షణ లేకే విధులకు డుమ్మా.... డుమ్మా కొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశం...

కనిగిరి స్వర్ణ సాగరం జూన్ 20

ప్రజలకు సేవలందించాల్సిన సచివాలయం సెక్రటరీలు ఫీల్డు పేరుతో విధులకు డుమ్మా కొడితే ఉపేక్షించేది లేదని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ తెలిపారు. శుక్రవారం కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని ఒకటవ సచివాలయంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో ఏడుగురు ఉద్యోగులకు ఒక్క ఉద్యోగి మాత్రమే విధుల్లో ఉన్నారు. మిగిలిన సిబ్బంది లేకపోవడంతో ఆగ్రహ వ్యక్తం చేశారు.విధులకు గైర్హాజరులో ఉన్న ఉద్యోగులపై జిల్లా కలెక్టర్ దృష్టికి లిఖిత పూర్వకముగా ఫిర్యాదు చేస్తానని ఆయన తెలిపారు.అనంతరం హాజరు పట్టిక మూమెంట్ రిజిస్టర్లను పరిశీలించ్చారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ కనిగిరి మున్సిపాలిటీలోని 12 సచివాలయాల్లో పనిసేసే సచివాలయం ఉద్యోగులు కొంత మంది ఉద్యోగులు కార్యాలయాల్లో అందుబాటు ఉండటం లేదని వీరిని క్షే త్ర స్థాయిలో పర్యవేక్షించ్చాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉందన్నారు.సచివాలయం ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల నుండి వచ్చిన సమస్యలను స్వీకరించుకొని క్షేత్రస్థాయిలో పరిష్కరించే దిశగా పనిచేయాలన్నారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించి ప్రజల మన్ననలు పొందాలని ఆయన హెచ్చరించారు.విధులు పట్ల నిర్లక్ష్యంగా వహించినట్లయితే ఉన్నతాధికారుల దృష్యా ప్రభుత్వ పరమైన కఠిన చర్యలు తప్పవని ఆయన తెలిపారు.

# నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలు





స్వర్ణసాగరం-శ్రీకాళహస్తి

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలు పట్టణంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ ఆధ్వర్యంలో, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్ రావు ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలకు స్వీట్లు పంచిపెట్టారు. శక్తి ఆలయాల్లో పూజలు చేశారు. ఎన్టీఆర్ ట్రస్ట్ పేరిట వేల మంది జీవితాల్లో నారా భువనేశ్వరమ్మ వెలుగులు నింపుతున్నారని కొనియాడారు. భువనేశ్వరమ్మ ఇస్తున్న ఆత్మస్థైర్యంతోనే నారా చంద్రబాబు నాయుడు 70 ఏళ్ల వయసులోనూ 30 ఏళ్ల యువకుడిలా పాలన చేయగలుగుతున్నారని కితాబిచ్చారు. పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

# పల్లేనిద్రలో భాగంగా వెంకటాపురం గ్రామం చేరిన సీ ఐ మరియు ఎస్ ఐ





## గ్రామ ప్రజలను చిఇతన్యపరుస్తున్న సీఐ. జయచంద్ర మరియు ఎస్ఐ అరుణ కుమార్ రెడ్డి

రేణిగుంట స్వర్ణ సాగరం జూన్ 20

వెంకటాపురం గ్రామంలో పల్లె నిద్రలో భాగంగా రేణిగుంట పోలీస్ స్టేషన్ ఎస్ జయ చంద్ర, ఇన్స్పెక్టర్ మరియు పీ అరుణ్ కుమార్ రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ రేణిగుంట పోలీస్ సిబ్బంది తో కలిసి వెంకటాపురం గ్రామంలో నిర్వహించారు. సీఐ జయచంద్ర మరియు ఎస్ ఐ అరుణ్ కుమార్ రెడ్డి కలిసి వెంకటాపురం గ్రామ ప్రజలకు నేటి సైబర్ క్రైమ్ పట్ల అవగాహన, మహిళలపై అత్యాచారాలు నివారణ, మరియు మాదకద్రవ్యాల అరికట్టుట గురించి వివరించి ప్రజలను చైతన్య పరిచారు. అవగాహన కార్యక్రమం అనంతరం బడి పిల్లలకి బుక్స్ మరియు పెన్నులను పంచిపెట్టారు.

# మెమో రైళ్ళ రద్దు

## రైల్వే స్టేషన్ అభివృద్ధి కమిటీ సభ్యులు

## ఆరు మూళ్ళ వరప్రసాద్

స్వర్ణ సాగరం ఓజిలి, జూన్ 20:



సూళ్లూరుపేట నుంచి నెల్లూరు వైపు తిరిగే లోకల్ రైలు నంబర్ 66035, నెల్లూరు నుంచి సూళ్లూరుపేట వరకు తిరిగే రైలు నంబర్ 66036 శని, ఆదివారాల్లో పూర్తిగా రద్దు చేసినట్లు రైల్వే స్టేషన్ అభివృద్ధి కమిటీ సభ్యుడు, మాజీ బీజేపీ మండల అధ్యక్షుడు ఆరు మూళ్ళ వరప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాదు నుంచి తాంబరం వెళ్లవలసిన చార్మినార్ ఎక్స్ ప్రెస్ శుక్రవారం నుంచి వచ్చే నెల 18 తేదీ వరకు తాంబరం కు బదులుగా చెన్నై బీచ్ వరకు వెళుతుందని దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారన్నారు. రైల్వే ప్రయాణికులు ఈ విషయాలను గమనించి ప్రయాణం చేయవలసిందిగా వరప్రసాద్ తెలియజేశారు.

# “అన్ని వ్యవస్థలలో రెవిన్యూ వ్యవస్థ కీలకం”



## ప్రత్యక్షంగా అందిస్తున్న సేవలు తహసిల్దార్ పద్మావతి

తోటపల్లి గూడూరు స్వర్ణసాగరం జూన్ 20

ప్రభుత్వ వ్యవస్థలలో రెవిన్యూ వ్యవస్థ చాలా కీలకమైందని ప్రత్యక్ష సేవలు అందిస్తున్నట్లు తోటపల్లి గూడూరు తహసిల్దార్ బూదూరు పద్మావతి తెలిపారు.

శుక్రవారం రెవెన్యూ దినోత్సవ సం దర్భంగా కార్యాలయంలో విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులను సన్మానించారు. ఈ స ందర్భం గా రెవిన్యూ శాఖ ద్వారా అందిస్తున్న సేవలు రైతాంగానికి ప్రత్యక్షంగా పరోక్షంగా నిరంతరం అందుబాటులో ఉండే విధంగా తమ శాఖ గుర్తింపు తెచ్చుకున్నట్లు ఆమె తెలిపారు. రెవిన్యూ సిబ్బంది అర్జీదారులతో ఎలా నడుచుకోవాలో ప్రత్యక్షంగా ప్రయోగాత్మకంగా విశదీకరించారు. విశ్రాంత రెవెన్యూ ఉద్యోగి బాబురావు ఇతరులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ శివయ్య వీఆర్వోలు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు

# మంత్రి కొల్లు రవీంద్ర కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన కోట



స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి

రాష్ట్ర మంత్రిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన తెదేపా రాష్ట్ర నాయి బ్రాహ్మణ సాధికార సమితి సోషల్ మీడియా కన్వీనర్ మంగళ ప్రభాకర్, తిరుపతి పార్లమెంట్ సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్ కొల్లు రవీంద్ర ని కలిసి శ్రీకాళహస్తీశ్వరుని శేష వస్త్రం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కొల్లు రవీంద్ర నాయి బ్రాహ్మణ ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు.

# చైతన్యుడే ‘సరైనోడు’




## టిడిపి మండల అధ్యక్షునిగా సీనియర్లు మద్దతు ‘శిరసనంబేటి’కి ఆత్మీయ సమావేశంలో వెల్లడి....

పెళ్లకూరు స్వర్ణసాగరం జూన్ 20.

సౌమ్యుడు, ప్రజ్ఞానశీలి, కార్యకర్తలకు అండగా.. ..అభిమానులకు తోడుగా... తెలుగు దేశం పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న యువనేత శిరసనంభేటీ చైతన్య కృష్ణారెడ్డి టిడిపి మండల అధ్యక్షుడిగా నియమించడానికి అన్ని విధాల “సరైనోడు” అంటూ పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ముక్తకంఠంతో నినంధించారు. మండల కేంద్రమైన పెళ్ళకూరులోని స్వర్ణముఖి సిస్టం ఆయకట్టు మాజీ చైర్మన్ పేరు రమేష్ నాయుడు నివాసం వద్ద శుక్రవారం జరిగిన ప్రత్యేక ఆత్మీయ సమావేశంలో తమ మనోభావాలను వెల్లడించారు. గత కొంతకాలంగా మండల టిడిపి అధ్యక్ష పదవి పోటీకి తీవ్ర ఉత్కంఠ నెలకొన్న విషయం అందరికీ తెలిసినదే. అయితే రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలను ఉద్దేశించి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనలతో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు యువతకు అవకాశం కల్పించాలని సంకల్పంతో మండలంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు నేతలంతా ఏకమై ఉత్సాహ వంతుడు, యువ నాయకుడు అయినా శిరసనం బేటి చైతన్య కృష్ణారెడ్డికి నూరు శాతం అవకాశం కల్పించాలని తమ మనసులోని మాటను ముక్తకంఠంతో వెల్లడి పరచడం జరిగింది. ఈ విషయమై తెలుగుదేశం పార్టీ అధిష్టానానికి, నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం కి, సుళ్లురుపేట శాసనసభ్యురాలు డాక్టర్ నలవాలా విజయశ్రీకు, ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగా ప్రసాద్ కు విన్నవించడం జరుగుతుందన్నారు. సుమారు 250కు పైగా వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన నాయకులు కార్యకర్తలు అంతా చైతన్య కృష్ణారెడ్డికి మండల టిడిపి పార్టీ పగ్గాలను మనస్ఫూర్తిగా అప్పగించాలని విజ్ఞప్తి చేశారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, పలువురు సర్పంచులు, ఎంపిటీసీలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.








# ‘కరుప్పు’ అంటూ వస్తున్న సూర్య.. టైటిల్ ఫస్ట్ లుక్ రిలీజ్

తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నటులలో కథానాయకుడు సూర్య ఒకరు. ఆయన నటించిన ప్రతి సినిమా ఇక్కడ కూడా విడుదలవుతుంది. అంతేకాదు, వైవిధ్యానికి పెద్ద పీట వేస్తూ ఆసక్తికర చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు వస్తారు. ఇప్పటికే తెలుగు దర్శకుడు వెంకి అట్లూరితో సినిమా చేస్తున్న సూర్య తమిళ కమెడియన్ ఆర్జే బాలాజీ దర్శకత్వంలో ఒక సినిమా చేస్తున్నాడు. సూర్య 45గా రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి తాజాగా ఫస్ట్‌లుక్‌తో పాటు టైటిల్‌ను ప్రకటించింది చిత్రయూనిట్. ఈ సినిమాకు కరుప్పు (నలుపు) అనే టైటిల్ పెట్టినట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ మూవీకి సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నాడు.



# ‘పెద్ది’లో రామ్ బుజ్జిగా దివ్యేందు..

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హైలీ యాంటిసిపేటెడ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ ‘పెద్ది’. నేషనల్ అవార్డ్ విన్నింగ్ ఫిలిం మేకర్ బుచ్చి బాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ పాన్ ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో విజనరీ వెంకట సతీష్ కిలారు తన ప్రతిష్టాత్మక బ్యానర్ వృద్ధి సినిమాస్ బ్యానర్ పై భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ‘మీర్జాపూర్’ వెబ్‌సిరీస్ ఫేమ్, బాలీవుడ్ స్టార్ యాక్టర్ దివ్యేందు శర్మ కీలక పాత్ర చేస్తున్నారు. గురువారం మేకర్స్ ఆయనకి బర్త్ డే విషెస్ చెబుతూ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో రామ్ బుజ్జి అనే ఆసక్తికరమైన క్యారెక్టర్‌లో ఆయన కనిపించబోతున్నారు. క్రికెట్ బంతిని ఎగరేస్తూ ఇంటెన్స్ లుక్‌లో కనిపించిన దివ్యేందు పోస్టర్ అదిరిపోయింది. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో నిర్మించిన మాసీవ్ సెట్లో హై-ఆక్టేన్, హై బడ్జెట్‌తో ఓ భారీ ట్రైన్ యాక్షన్ ఎపిసోడ్ షూట్ చేస్తున్నారు. ఈ మైండ్- బ్లోయింగ్ యాక్షన్ సీక్వెన్స్ సినిమాలో మేజర్ హైలైట్‌గా వుండబోతోంది. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శివరాజ్ కుమార్, జగపతి బాబు ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రం 2026 మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజున ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.





# ఓటీటీకి పూరి జగన్నాథ్ తమ్ముడి సినిమా..

దర్శకుడు పూరి జగన్నాథ్ సోదరుడు శ్రీరామ్ శంకర్ హీరోగా నటించిన చిత్రం ఒక పథకం ప్రకారం. ఈ ఏడాదిలో ఫిబ్రవరిలో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమా అంతగా ఆకట్టుకోలేకపోయింది. ఈ సినిమాకు మలయాళ డైరెక్టర్ వినోద్ కుమార్ విజయన్ దర్శకత్వం వహించారు. క్రైమ్ థ్రిల్లర్ జోనర్లో వచ్చిన ఈ సినిమాలో శృతి సోది, ఆషిమా నర్వాల్, సముద్రఖని కీలక పాత్రలు పోషించారు. తాజాగా ఈ సినిమా ఓటీటీకి వచ్చేసింది. రిలీజైన ఐదు నెలల తర్వాత ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ రోజు నుంచే సన్ నెక్ట్స్‌లో అందుబాటులోకి వచ్చింది. ఈ సినిమా క్లైమాక్స్ యాక్షన్ సీన్ కోసం 25 డాగ్స్‌తో ఫైట్ సీన్ తెరకెక్కించారు. కాగా.. హీరో సాయిరాం శంకర్ 143, బంపర్ ఆఫర్ లాంటి సినిమాలతో టాలీవుడ్‌లో గుర్తింపు తెచ్చుకున్నారు. చాలా గ్యాప్ ఇచ్చిన ఈ ఏడాది ఒక పథకం ప్రకారం అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చారు. ఈ కథ మొత్తం 2014 విశాఖపట్నంలో జరుగుతూ ఉంటుంది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిద్ధార్థ నీలకంఠ (సాయిరాం శంకర్) భార్య సీత (ఆషిమా నర్వాల్) షాపింగ్ కి వెళ్లగా అక్కడ భార్య మిస్ అవుతుంది. ఆమె ఏమైందో తెలియక ఇబ్బంది పడుతున్న సిద్ధార్థ డ్రగ్స్‌కు బానిస అవుతాడు. అయితే సిద్ధార్థతో కలిసి డ్రగ్స్ తీసుకునే దివ్య(భాను శ్రీ) అనూహ్యంగా దారుణమైన స్థితిలో హత్యకు గురవుతుంది. ఈ కేసు విచారణలో ఏసిపి రఘురాం(సముద్రఖని), సిద్ధార్థ ఈ మర్డర్ చేశాడని భావించి అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెడితే డ్రగ్స్ కేసు కారణంగా సస్పెండ్ కావడంతో ఆ స్థానంలో ప్రాసిక్యూటర్‌గా రావాలని ప్రయత్నించే చినబాబు (కళాభవన్ మణి) కూడా సిద్ధార్థని ఇరికించే ప్రయత్నం చేస్తాడు. అయితే తాను స్వతహాగా లాయర్ కావడంతో తాను హత్య చేయలేదని నిరూపించుకునే ప్రయత్నం చేస్తాడు సిద్ధార్థ్. తర్వాత ఇదే క్రమంలో అనేక హత్యలు జరుగుతున్నాయని తెలుసుకుని అసలు ఈ హత్యలకు కారణం ఎవరు అని తెలుసుకునే ప్రయత్నం చేస్తాడు.



# బికినీలో రమ్య పసుపులేటి అందాల జాతర..



### సిటీలో ‘అనంత పద్మనాభ స్వామి’ సెట్..

# పాట కోసమే పది కోట్లు!

‘పెదకాపు’ చిత్రం ఫేమ్ విరాట్ కర్ణ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘నాగబంధం’. ‘ది సీక్రెట్ ట్రెజర్’ అన్నది ట్యాగ్‌లైన్. నిర్మాత అభిషేక్ నామా ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. నభా నటేశ్, ఐశ్వర్యా మీనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. లక్ష్మీ ఐరా, దేవాన్ష్ నామా సమర్పణలో ఎన్‌ఐకే స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్‌పై కిశోర్ అన్నపురెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ సినిమా కోసం ప్రొడక్షన్ డిజైనర్ అశోక్ కుమార్ ప్రత్యేకంగా తీర్చిదిద్దిన కేరళ అనంత పద్మనాభ స్వామి టెంపుల్ సెట్‌లో పాట చిత్రీకరణ జరుగుతోంది. “ఈ పాటలో విరాట్ కర్ణతో పాటు 5000 మంది నృత్య కళాకారులు పాల్గొంటున్నారు. బాలీవుడ్ కొరియోగ్రాఫర్ గణేశ్ ఆచార్య పర్యవేక్షణలో ఈ పాటను చిత్రీకరిస్తున్నాం. ఈ ఒక్క ఎపిసోడ్‌కే రూ. 10 కోట్లు బడ్జెట్ కేటాయించాం. ఈ అద్భుతమైన సీక్వెన్స్ ఎప్పటికీ గుర్తుండిపోయేలా ఉంటుంది” అని చిత్రయూనిట్ పేర్కొంది. జగపతిబాబు, జయప్రకాశ్, మురళీ శర్మ, బీఎస్ అవినాష్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సౌందర్ రాజన్ ఎస్, సంగీతం: అభే.